విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

సోమవారం 20 జనవరి 2025   8 పేజీలు

అమిత్ షా గో బ్యాక్

అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలకు సీపీఐ నిరసనలు

విశాలాంధ్ర-మచిలీపట్నం : రాజ్య సభలో భారతరత్న, ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, అమిత్‌షా వెంటనే పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేయాలని మచిలీపట్నంలో ఆదివారం అమిత్‌షా గోబ్యాక్ అంటూ స్థానిక రుస్తుం బాధ శివాలయం సెంటర్లోని గాంధీ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ అవమానం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కి కాదని, భారత రాజ్యాంగాన్ని అవమానించడమేనని, ఇలాంటి వ్యాఖ్యలను ఖండిస్తూ ఇకముందు ఎన్నడు ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దని, వెంటనే హోం మంత్రిని భర్తరఫ్ చేయాలని, దీనిపై ఇప్పటివరకు ప్రధానమంత్రి గాని కేంద్ర ప్రభుత్వం గానీ మాట్లాడకపోవడాన్ని సీపీఐ తరుపున ఖండిస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, లేని పక్షంలో వామపక్ష పార్టీలన్నీ మిగతా 2 లో ...

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న

మోదీ, అమిత్‌షా

పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలి : కాసా రాంబాబు డిమాండ్

విశాలాంధ్ర-నరసరావుపేట: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవహేళన చేసిన కేంద్ర హోం మంత్రి అమిషాను మంత్రి పదవి నుండి తప్పించాలని, పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం సీపీఐ శ్రేణులు అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాసా రాంబాబు మాట్లాడుతూ దేశ రాజకీయాలను, రాష్ట్ర రాజకీయాలను పార్లమెంటుని ప్రజాస్వామ్యాన్ని మోడీ అమిత్ షాలు చంపేస్తున్నారని, దేశంలోనూ మిగతా 2 లో ...

విద్యాశాఖలో

బది'లీల'లు

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు... మూసివేత దిశగా ప్రభుత్వ విద్యాలయాలు

> 'ప్రభుత్వ విద్యాలయాల్లో నాణ్యమైన విద్యను, విద్యార్థులకు అవసరమైన ఇతర సంక్షేమాన్ని అందించేందుకు కట్టుబడి ఉన్నాం' ఇది ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న హామీ. 'ఒకరిద్దరు ఉపాధ్యాయులతో నడుస్తున్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు పంపి, అక్కడి విద్యార్థులను విద్యకు దూరం చేస్తాం.' ఇది అధికారుల వ్యవహారశైలి నెలకొంది.

విశాలాంధ్ర-విస్సన్నపేట : ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా డిప్యుటేషన్లపై కూడా ఒక చోట నుంచి మరోచోటుకు ఉపాధ్యాయులను పంపవద్దని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఎక్కడా ఒక్క ప్రభుత్వ పాఠశాల కూడా సరైన సంఖ్యలో విద్యార్థులు లేరనే కారణంతో మూసివేయద్దని సూచనలు సైతం మిగతా 2 లో ...

కూలీ రేట్ల పెంపు

హర్షణీయం

15 శాతం పెంచడాన్ని స్వాగతిస్తున్నాం : సురేష్‌బాబు, రావుల అంజిబాబు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరంలో పనిచేస్తున్న డాల్ మిల్లు ముఠా కార్మికులకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కూలీ రేట్లు పెంపు ప్రక్రియ ఒక సాంప్రదాయంగా నగర ముఠా కార్మిక సంఘం(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కొనసాగుతుందని, అయితే ఈసారి కూడా ఆ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ డాల్ మిల్లర్స్ అసోసియేషన్ కూలీ రేట్ల పెంపుకు అంగీకారం తెలుపటం హర్షణీయమని ఏఐటీయూసీ గుంటూరు నగర గౌరవ అధ్యక్షులు జి.సురేష్ బాబు, అధ్యక్షులు రావుల అంజిబాబులు తెలిపారు. స్థానిక సంగడిగుంట నగర ముఠా కార్మిక సంఘం కార్యాలయం రేగుల రాఘవయ్య భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన గుంటూరు డాల్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో డాల్ మిల్లర్స్ యాజమాన్యంతో ఏఐటీయూసీ, డాల్ మిల్లు ముఠా కార్మిక సంఘం చర్చలు జరిపినట్లు తెలిపారు. ఈ చర్చల సందర్భంగా కూలీ రేట్లు పెంపుకు డాల్ మిల్లర్స్ మిగతా 2 లో ...

5
బుడ్డి రాయప్ప గృహనిర్బంధం

7
అనధికార కుళాయిల తొలగింపు

ధాన్యం కొనుగోలు చేయాలి

రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము

విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : పల్నాడు జిల్లాలోని రైతులు పండించిన దాన్యం వెంటనే కూటమి ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము డిమాండ్ చేశారు. ఆదివారం వినుకొండ మండల పరిధిలోని పలు గ్రామాలలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ నాలుగేళ్లుగా ప్రకృతి అనుకూలించక మిగతా 2 లో ...

పసుపు రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలి : యార్లగడ్డ

4 లో ...

(మొదటి పేజీ తరువాయి)

అమిత్ షా గో బ్యాక్

కలిసి ఈ నిరసన కార్యక్రమం ఉధృతంచేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు మోదుమూడి రామారావు, నియోజకవర్గ కార్యదర్శి లింగంఫిలిప్, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు తురక లక్ష్మణ రావు, సుబ్రహ్మణ్యం రమణయ్య, నరేంద్రకుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ, అమిత్‌షా

రాష్ట్రంలోనూ రాజకీయాలను కేంద్రంలో ఉన్న మోదీ అమిత్ షాలు ఖూనీ చేస్తున్నారని అన్నారు. మణిపూర్ రాష్ట్రంలో మతోన్మాదులు ప్రజల మధ్య విద్వేషాలు రగిలించి స్త్రీలను నగ్నంగా చేసి అవమాన పరుస్తూ మారణ హోమం సృష్టిస్తుంటే నరేంద్ర మోడీ మాత్రం లౌకిక దేశాలను చుట్టి రావడం తన బాధ్యతగా అనటం ఏమిటని ఎద్దేవా చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని 32 మంది బలిదానంతోనే కాకుండా భారత కమ్యూనిస్టు పార్టీకి చెందిన 57 మంది ఎర్రజెండా ముద్దుబిడ్డలు ఎమ్మెల్యేలుగా, ఏడుగురు పార్లమెంటు సభ్యులుగా విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం రాజీనామా చేసిన చరిత్ర ఎవరు జరిపిన చెరిగేది కాదని స్టీల్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరించడం తప్ప మరొకటి లేదని హోంకరిస్తూ కూర్చున్న మోదీ ప్రభుత్వం మెడలు వంచి ప్రైవేటీకరణని వెనక్కి పంపి విశాఖ ఉక్కును భారతదేశంలోనే నెంబర్‌వన్‌గా చేస్తామని కుమారస్వామి అన్నారని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ మోడీ ప్రభుత్వ దుర్మార్గ నిర్ణయాన్ని వెనక్కి నెట్ట కలిగాం అమిత్ షా గో బ్యాక్ అనేటటువంటి నినాదంతో నరేంద్ర మోదీ అమిత్ షా వీళ్ళిద్దరూ ఒక్క కాంబినేషన్లో ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ప్రజలపై రుద్దటానికి, ప్రపంచంలోనే లౌకిక దేశంలో పెద్ద ప్రజాస్వామ్య మనువాద రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టడం కోసం జరుగుతున్నటువంటి కుట్రలో భాగంగానే పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ జపం చేస్తూ ఉన్నారు అదొక ఫ్యాషన్ అయిపోయింది దాని బదులు భగవాన్ నామ స్మరణ చేస్తే డైరెక్ట్ గా స్వర్గానికి వెళ్లొచ్చు అంటూ అమిత్ మాట్లాడిన తీరు మనువాద అమిత్ షా కి రెడ్ కార్పెట్ పరుస్తున్నారని అన్నారు. రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ మాట్లాడిన అమిత్ షా అదే రాజ్యాంగంపై ప్రమాణ స్వీకారం చేసిన సంగతి గుర్తు లేదా అన్నారు. మోడీ అమిత్ షా వారి మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావడానికి అల్లర్లు సృష్టిస్తూ గొడవలు చేస్తూ ప్రజల మధ్య మత విద్వేషాలను రగులుస్తూ చోద్యం చూస్తూ ఉన్నారని అమీషా విజయవాడ పర్యటన సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో అమీషా గో బ్యాక్ అంబేద్కర్ కు క్షమాపణ చెప్పాలని సిపిఐ డిమాండ్ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, ప్రజానాట్యమండల కార్యదర్శి ఎస్కె చిన్న జాను సైదా, సిపిఐ నాయకులు నాగేశ్వరావు, అంజిరెడ్డి, సుబ్బారావు, వెంకయ్య, సుబ్బారెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కూలీ రేట్ల పెంపు హర్షణీయం

యాజమాన్యాలు అంగీకారం తెలిపినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇస్తున్న కూలీ రేట్లకు అదనంగా 15 శాతం పెంచడానికి ఈ చర్చలలో నిర్ణయించడం జరిగిందన్నారు. కూలీ రేట్లు 15 శాతం పెంచటాన్ని ఏఐటీయూసీ స్వాగతిస్తుందని అన్నారు. సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ చర్చల ద్వారా కూలీ రేట్లు పెంచడానికి మిల్లు యాజమాన్యాలు అంగీకారం తెలిపినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేశారు. పెరిగిన కూలీ రేట్లు ఈ నెల 20వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని నాయకులు వెల్లడించారు. పలువురు ముఠా కార్మికుల నాయకులు మాట్లాడుతూ తమ కూలీ రేట్ల పెంపుదలకు కృషిచేసిన ఏఐటీయూసీ నాయకత్వానికి, డాల్ మిల్లర్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో డాల్ మిల్లు ముఠామేస్త్రిలు పొందుగుల యలమందరెడ్డి, దేవరపల్లి శివారెడ్డి, యేనుగంటి వెంకట్రావు, సిరిగిరి దుర్గా, దోర్నాల సోమిరెడ్డి, కె.సుబ్బారావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు జాతీయ ప్రతిభా అవార్డులు

విశాలాంధ్ర-దాచేపల్లి : దాచేపల్లికి చెందిన ఐదుగురు మహిళా ఉపాధ్యాయులు సావిత్రీ బాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డులను ఆదివారం అందుకున్నారు. వారిలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయినులు ఉన్నారు. ప్రొఫెసర్ వంటల అమరేశ్వరి, ఉపాధ్యాయులు సుజాత, గరికపాటి పద్మావతి, విజయరాణి, కృష్ణకుమారి ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. దక్షిణాది ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఈ ఐదుగురు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. వీరందరికీ ఉపాధ్యాయ రంగంలో 15 నుంచి 32 సంవత్సరాల అనుభవం ఉంది. వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తూ మంచి పేరు గడించారు. ప్రొఫెసర్ వంటల అమరేశ్వరి సొంతంగా గుంటూరులో ఓ కోచింగ్ సెంటర్ ను నడుపుతున్నారు. పీహెచ్డీ కూడా చేస్తున్నారు. ఈ ఐదుగురు మహిళా ఉపాధ్యాయులకు దాచేపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న అన్ని బ్యాచ్ ల పూర్వ విద్యార్థులతో పాటు పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందించారు.

విద్యాశాఖలో బది'లీల'లు

జారీ చేసింది. అయితే విద్యార్థుల సంఖ్య అల్పంగా ఉన్న బడుల నుంచి అధికంగా ఉన్న బడులకు ఉపాధ్యాయులకు పని సర్దుబాటు చేయాలని ఆదేశించింది. విస్సన్నపేట మండలంలో ఈ సూచనలు, ఆదేశాలకు విరుద్ధంగా అధికారులు ఇష్టానుసారం ఉపాధ్యాయుల స్థానాలను మార్పు చేస్తున్నారని, ఈ కారణంగా కొన్ని పాఠశాలలు మూసివేతకు కూడా గురయ్యాయని ఉపాధ్యాయవర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అల్పంగా విద్యార్థులు ఉన్నచోట అధికస్థాయిలో ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించి, అధికంగా ఉన్న చోట్ల ఉపాధ్యాయులను తప్పించి, పాఠశాలల మూసివేతకు కారణంగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని పలు పాఠశాలల్లో ఏకోపాధ్యాయ విద్యాలయాలుగా నడుస్తున్న స్కూళ్ల నుంచి ఉపాధ్యాయులను ఇష్టానుసారం మరోచోటికి బదిలీ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని కలగర ఎస్సీవాడలో ఏకోపాధ్యాయునితో నడుస్తున్న పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడిని ఇక్కడి నుంచి మరోచోటికి బదిలీ చేయటంతో ఈ పాఠశాల గత కొంతకాలంగా నడవటంలేదని తెలుస్తోంది. చేపూరివారిపాలెం ఎయిడెడ్ పాఠశాలకు చెందిన ఒక ఉపాధ్యాయురాలిని విద్యాశాఖకు బదలాయించగా, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులున్న విస్సన్నపేట 3,4 వార్డుల పాఠశాలకు కేటాయించి, ఆపై డిప్యుటేషన్‌పై అవసరం లేకున్నా మరోచోటికి తరలించారని తెలుస్తోంది. నూతిపాడులో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఒక ఉపాధ్యాయుడు పనిచేయాల్సి ఉండగా, అదనంగా మరొకరికి విధులు అప్పగించినట్లు సమాచారం. ఇలా మండలంలోని మరికొన్ని చోట్ల ఇదే విధానం కొనసాగుతుండటంతో పలు గ్రామాల్లో ప్రభుత్వ విద్యావ్యవస్థకు ప్రమాదంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏ పాఠశాలలో ఎందరు విద్యార్థులు, వారికి బోధించేవారి సంఖ్య ఎంత, ఎక్కడ విధులు నిర్వర్తించాల్సినవారు ఎక్కడ నిర్వర్తిస్తున్నారు, అసలు వీరిపై అధికారుల పర్యవేక్షణ సక్రమంగా కొనసాగుతోందా అనే అంశాలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీళ్లు లేక మెట్ట పైరులు కూడా పండించుకోవటం అంతంత మాత్రమే అయింది. ఈ ఏడాది ప్రకృతి అనుకూలించి నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. ఈ ఏడాది వరిసాగుకు ప్రభుత్వం రైతులకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఒక్క పల్నాడు జిల్లాలోనే 80 వేల ఎకరాలపైగా వరి సాగు చేయడం జరిగింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం రెండు లక్షల మెట్రిక్ టన్నులను రైతులు ఈ ఏడాది ఒక ఖరీఫ్‌లోనే ఉత్పత్తి చేయడం జరిగింది. ప్రభుత్వం కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేయకముందు రైతులు వద్ద నుంచి 75 కేజీల ధాన్యం బస్తాను రూ.1300 నుంచి రూ.1400లకు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేయటం జరిగింది. ఎప్పుడైతే ప్రభుత్వం కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేసి కొనుగోలు చేయటం మొదలుపెట్టిందో రైతుల కల్లాలో కోసిన ధాన్యం కోసినట్టుగా రూ.1550లకు ఎటువంటి తరుగు లేకుండా కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ఒక రూ.50ల తేడాతో రైతుకు ఎటువంటి రిస్కు లేకుండా వ్యాపారస్తులు రైతులు వద్ద నుంచి కొనుగోలు చేయటం జరిగిందన్నారు. ప్రభుత్వం కేవలం 5000 మెట్రిక్ టన్నులు కొన్నప్పటికీ పరోక్షంగా లక్ష మెట్రిక్ టన్నులు పైగా వ్యాపారు చేత కొనిపించింది. ఎప్పుడైతే ప్రభుత్వం ఇక కొనదు టార్గెట్ అయిపోయిందని పుకార్లు రావడంతో మళ్లీ పాత పరిస్థితికి రైతులు వద్ద ధాన్యం వ్యాపారస్తులు కొనే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ కొనుగోలు సెంటర్లు పెట్టడం ద్వారా రైతుకు పరోక్షంగా నైతిక బలాన్ని ఇచ్చినట్లు అవుతుందన్నారు. వ్యాపారి వద్ద రైతు గొంతు బలంగా వినిపించడానికి అవకాశం ఉంటుంది. నువ్వు కొనకపోతే ప్రభుత్వానికి అమ్ముకుంటామని రైతు ధైర్యంగా మాట్లాడే అవకాశం ఉంటుంది. ఎప్పుడైతే ప్రభుత్వ కొనుగోలు సెంటర్లు లేనప్పుడు వ్యాపారస్తుడు చెప్పింది వేదం అవుతుంది. కావున కూటమి ప్రభుత్వం రైతుల పట్ల దయఉంచి ఇంకొక 30 వేల మెట్రిక్ టన్నులు పల్నాడు జిల్లాలో కొనటానికి ఏర్పాటు చేయవలసిందిగా ఉలవలపూడి రాము కుటమి ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు పెద్దారావు, శ్రీను, వెంకటేశ్వర్లు, తోట నరసింహారావు, యోగేశ్వరరావు, మునయ్య, రామచంద్రరావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ షోరూమ్ ప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-పెదకాకాని : మండల పరిధిలోని ఆటోనగర్‌లో ఎలక్ట్రికల్ ట్రాక్టర్ షోరూమ్‌ను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మురుగప్ప గ్రూప్ వారు ఆసియాలోనే మొట్టమొదటిసారి ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని గుంటూరులో ఈ షోరూమును ప్రారంభించడం అభినందనీయమని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాలుష్య రహిత ఆంధ్రప్రదేశ్ తీసుకురావాలని ఇప్పటికే ఎలక్ట్రికల్ బస్సులు, ఆటోలు, బైకులు తీసుకురావడం జరిగిందని, ఇప్పుడు ఎలక్ట్రికల్ ట్రాక్టర్లు షోరూమ్ రావడం మన ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని అన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఈ ఎలక్ట్రికల్ ట్రాక్టర్ల వల్ల జరిగే ప్రయోజనాల గురించి వివరిస్తానని తెలిపారు. దాని వలన రైతులకు ఏ విధమైన ప్రయోజనాలు కలుగుతాయో తెలియజేస్తానని, ముఖ్యమంత్రితో మాట్లాడిన తర్వాత అవసరమైతే రైతులకు సబ్సిడీ మీద ఎలక్ట్రికల్ ట్రాక్టర్లు ఇప్పించే ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ ట్రాక్టర్లు రైతులకే కాకుండా మున్సిపాలిటీల్లో మండలాల్లో గ్రామాల్లో పంచాయతీలు తరఫున వాడుకోవడానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయని తెలియజేశారు. ఈ ఎలక్ట్రికల్ ట్రాక్టర్లపై రైతులకు అవగాహన ఏర్పాటు చేయాలని ప్రస్తుతం నడుస్తున్న ట్రాక్టర్‌తో పోలిస్తే ఈ ట్రాక్టర్ల వల్ల రైతులకు 70 శాతం ఉపయోగం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, కంపెనీ సీఈఓ హరిచంద్రప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా తక్షణం రాజీనామా చేయాలి

విశాలాంధ్ర-అమరావతి : దేశానికి దశాదిశా నిర్దేశించే రాజ్యాంగాన్ని అందించిన మహోన్నతమైన వ్యక్తి బీఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తక్షణం రాజీనామా చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ, సీపీఐ పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు, సీపీఎం అమరావతి కార్యదర్శి సూరిబాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన అమరావతిలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా గో బ్యాక్ అంటూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా నాయకులు బైరాపట్నం రామకృష్ణ మాట్లాడుతూ దేశ ప్రజా పాలన పక్కదోవ పట్టిస్తూ మనుధర్మ శాస్త్ర అనుగుణంగా ఆర్ఎస్ఎస్ అజెండాతో పాలన కొనసాగిస్తూ దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలపై దాడులు చేస్తూ కాలం గడుపుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలు ఎండగట్టేందుకు వామపక్షాలు నిర్వహించే ప్రజా ఉద్యమాల్లో సభ్యసమాజం పాల్గొనాలని కోరారు. నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునుగోడు శ్రీనివాస రావు మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై అర్ధన గ్నంగా దాడులు జరిపిస్తూ రక్షణ కల్పించలేని కేంద్ర ప్రభుత్వం విదేశీ పర్యటనలు చేస్తూ దేశం వెలుగు మార్గం వైపుకు నడిపిస్తున్న ఏకైక శక్తివంతమైన పరిపాలన కొనసాగిస్తున్నామని ప్రగల్భాలు పలకడం సరైంది కాదన్నారు. దేశంలో అంబేద్కర్ రాజ్యాంగం లేనిదే సామాజ ప్రజల హక్కులు పరిరక్షించబడవని గుర్తెరిగి పరిపాలన కొనసాగించాలన్నారు. సీపీఎం కార్యదర్శి సూరిబాబు మాట్లాడుతూ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన వారికి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు, నాయకులు నందూరి జోజి, వెంకయ్య, బి.వేదాంతం, గాలం సాంబయ్య, కె.మంత్రాలు, ముని, గోపి, తిరుపతయ్య, శ్యాంసోన్, మేడా శంకర్, నాగరాజు, సీపీఎం నాయకులు ఎన్.వెంకటేశ్వరరాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సభ్యుడు మృతి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సభ్యుడు ఇండ్ల శ్రీను శనివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సీపీఐ నాయకులు ఆదివారం ఆయన నివాసానికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు, ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, సీపీఐ నాయకులు సీఆర్ సృజన్, నరసింహభారతి మున్సిపల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు అంజయ్య, కోమరగిరి చెంచయ్య, పోతురాజు తదితరులు ఉన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : ఉచిత పశు ఆరోగ్య శిబిరాల ద్వారా తమ పశువులకు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బెల్లంకొండ సరోజా దేవి అన్నారు. వినుకొండ, నూజెండ్ల మండలాల పరిధిలోగల అన్ని గ్రామాలలో పశువుల ఆరోగ్యానికి, వాటిలో ఉత్పాదకతను పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు పశుఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తోందని, రైతులంతా ఈ సేవలను వినియోగించుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ బి.సరోజా దేవి ఆదివారం తెలిపారు. ఈ శిబిరాలలో పశువైద్య చికిత్సలు నిర్వహించడంతోపాటు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ పశు యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని, కావున పశు పోషకులు పశువైద్యులు అందించే సేవలను వినియోగించుకొని పాల దిగుబడి పెంచేందుకు ప్రయత్నించాలని కోరారు.

గోశాలకు రూ.1,00,116 విరాళం

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని నిదానంపాడు శ్రీలక్ష్మీ అమ్మవారి మొక్కుబడి తీర్చుకొనేందుకు ఆదివారం పల్నాడు జిల్లా, అచ్చంపేట మండలం, ఓర్వకల్లు గ్రామానికి చెందిన అమ్మవారి భక్తురాలు అరవపల్లి నవోదయం దేవస్థానం వద్దకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె అమ్మవారిని దర్శించుకున్నారు. గతంలో ఆమె అనుకున్న కోరిక నేరవేరడంతో దర్శనం నిమిత్తం వచ్చారు. కోరిక నేరవేరిన ఫలితంగా రూ.1,00,116లు అమ్మవారి గోశాలకు విరాళంగా ఆమె అందజేసినట్లు ఆలయ ఛైర్మన్ యాగంటి వెంకటేశ్వర్లు, ఆలయ సహాయ కమిషనర్ అండ్ కార్యనిర్వాహణాధికారి పి.సైదమ్మబాయి తెలిపారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ

విశాలాంధ్ర-మాచర్ల : రంగమ్మ చిల్డ్రన్స్ వైద్యశాల సహకారంతో అబ్దుల్ కలామ్ సేవా సమితి అధ్యక్షుడు షేక్ పాషావలి ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. పాషావలి మాట్లాడుతూ పట్టణంలో రంగమ్మ చిల్డ్రన్స్ వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ దశరథు, బాలాజీ డెంటల్ వైద్యులు సైదులు నాయక్ సేవలు అభినందనీయమన్నారు. వారి సహకారంతోనే 10 మంది వికలాంగులకు దుప్పట్లను పంపిణీ చేసినట్టు తెలిపారు. అనంతరం డాక్టర్ దశరథు, సైదులు నాయకులును ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం నాయకులు అంజిబాబు, శంకర్, మను, మక్కెన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని నిదానంపాడు అగ్రహారంలో వేంచేసియున్న శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థానం వద్దకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు కుటుంబ సమేతంగా కుంకుమ పూజలు, అభిషేకాలు, అన్నప్రాసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం మొక్కుబడులు, కానుకలను హుండీల్లో సమర్పించుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి నీటి ఎద్దడి లేకుండా పుష్కలంగా నీటిని సరఫరా చేశారు.

అహ్మద్ అలీ మృతి పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర-అమరావతి : టీడీపీ సీనియర్ నాయకులు షేక్ అహ్మద్ అలీ మోడరన్ సాహెబ్ మృతి చెందటం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని, వారు లేని లోటు పార్టీ జీర్ణించుకోలేదని తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన అమరావతిలో తెలుగుదేశం పార్టీకి చెందిన సీనియర్ నాయకులు షేక్ అహ్మద్ అలీ మృతి చెందటంతో విషయం తెలుసుకున్న కొమ్మాలపాటి శ్రీధర్ హుటాహుటినా మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తూ పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేసిన మంచి మనసున్న వ్యక్తి అలీ అని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ నాయకులు కన్యధార వసంతరావు, వెంకటేశ్వర్లు, బాలరాజు తదితరులు ఉన్నారు.

అమిత్ షా పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలి

విశాలాంధ్ర-మంగళగిరి : కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదవీ ప్రమాణ స్వీకారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంపై చేసిన సంగతి గుర్తు లేదా అని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య ప్రశ్నించారు. ఆదివారం మంగళగిరి పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్రానికి వచ్చిన అమిత్ షా గో బ్యాక్ అంటూ సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్, ప్రజాతంత్ర వాదులు నిరసన వ్యక్తం చేశారు. ప్లే కార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవహేళనగా మాట్లాడిన అమిత్ షా పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలని తిరుపతయ్య డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలు అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కొనియాడుతుంటే కేంద్ర హోం మంత్రి అమిత్ షా భారతదేశంలో మాత్రం అవమాన పరుస్తున్నారని ఆయన అన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి వీవీ జోహార్ లాల్ మాట్లాడుతూ దేశంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అవమానపరిచి బీజేపీ ప్రభుత్వ మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావడానికి మోదీ, అమిత్ షాలు కుట్ర పన్ని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆయన అన్నారు. ఆంధ్ర రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్న కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా అప్పులు ఇస్తూ ఆంధ్ర రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తుందని ఆయన అన్నారు.

ఆత్మకూరు గ్రామంలో:

ఆత్మకూరు గ్రామంలో సాయిబాబా గుడి వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో అమిత్ షా గో బ్యాక్ అంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవహేళనగా మాట్లాడిన అమిత్ షా అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన కాళ్లు పట్టుకొని క్షమాపణ చెప్పాలని జాన్ బాబు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమాలలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, పంతగాని మరియదాసు, కాబోతు ఈశ్వరరావు, ఉయ్యాల సత్యనారాయణ, గోహార్ జానీ, కె.నరసింహారావు, బాపనపల్లి శంకర్రావు, సీపీఎం నాయకులు ఎస్ఎస్ చంగయ్య, జేవీ రాఘవులు, గని, సీపీఐ ఎంఎల్ నాయకులు కూరపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో వామపక్షాల నిరసన

విశాలాంధ్ర-తాడేపల్లి : భారత ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తూ, పరిపాలన చేస్తున్న బీజేపీ కేంద్రమంత్రి అమిత్ షా గో బ్యాక్ అని సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బోసు బొమ్మ సెంటర్ వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అమిత్ షా పర్యటన నిరసిస్తూ సీపీఐ, సీపీఎం శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కంచర్ల కాశయ్య, బూరగ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన చేయాల్సిన బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా అరాచక పాలన చేస్తుందని విమర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంటు సాక్షిగా అవమానించిన అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని, రాజధాని నిర్మాణానికి, కడప ఉక్కు కర్మాగారానికి నిధులు కేటాయిస్తామని చెప్పిన బీజేపీ నాయకులు వాగ్దానాలను అమలుపరచకుండా, రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని ఆయన మండిపడ్డారు. సీపీఐ ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, సీపీఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకే బీజేపీ పరిపాలన సాగిస్తుందని అన్నారు. అదేవిధంగా వ్యవసాయ మోటార్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు పూనుకున్న బీజేపీని దేశంలో అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మానికొండ డాంగే, షేక్ బాషా, సీపీఎం తాడేపల్లి పట్టణ నాయకులు వేముల దుర్గారావు, దొంతి రెడ్డి విజయభాస్కర్ రెడ్డి, కొట్టే కరుణాకర రావు, వై.బర్నబాస్, బిట్ర రామారావు, దర్శనపు విజయ్ బాబు, బి.గోపిరెడ్డి, వి.శాస్త్రి, కె.మేరీ తదితరులు పాల్గొన్నారు.

తాడికొండలో వామపక్షాల నిరసన

విశాలాంధ్ర-తాడికొండ : పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సీపీఐ, సీపీఎంలు నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలో ఆదివారం నిరసన చేపట్టారు. పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మౌనం పాటించారు. బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ అమిత్ షా మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేసేందుకు కంకణం కట్టుకున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు, సీపీఐ నాయకులు రేపూడి శ్రీనివాసరావు, కుర్ర అనిల్ కుమార్, సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, బాణావత్ భద్రయ్య, జోజి, కె.పూర్ణయ్య పాల్గొన్నారు.

విద్య, విజ్ఞానంతోనే విజయాలు : ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : "ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం చదువొక్కటే" అన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాటలు అక్షర సత్యాలని ఎమ్మెల్సీ, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ళ అప్పిరెడ్డి స్పష్టం చేశారు. 'తల దించుకుని నన్ను చదువు-తల ఎత్తుకునేలా నిన్ను చేస్తా' అని పుస్తకాలు ఎళ్ళవేళలా విద్యార్థులను ప్రేరేపిస్తూ ఉంటాయని ఆయన తెలిపారు. స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు అత్యంత ఉపయుక్తమైన యస్‌యస్‌సి న్యూ మోడల్ టెస్ట్ పేపర్-2025 పుస్తకాన్ని ఉచితంగా అందజేయాలన్న సంకల్పంతో ఆన్‌లైన్‌లో ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌ను ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఆదివారం తన నివాసంలో జరిగిన ఒక కార్యక్రమంలో దీనికి సంబంధించిన పోస్టర్లను విద్యారంగ ప్రముఖులు, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ 'విద్యతో కేవలం విజ్ఞానం మాత్రమే కాదు, అద్భుతమైన విజయాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును నిర్దేశించుకోవటంతో పాటు వారి కుటుంబ స్థితిగతులను మెరుగుపరుచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు డాక్టర్ పోలే ముత్యం, కంజుల సత్యనారాయణరెడ్డి, స్ఫూర్తి ఫౌండేషన్ కార్యదర్శి పి.ఎన్.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దావా సమన్లు

మహారాజశ్రీ గురజాల సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

ఓ.యస్.నెం. 26/2022

బిట్వీన్:

అవిరినేని చంద్రశేఖర్ రావు ...వాది

మరియు

M/s. శ్రీ గాయత్రి ధాలు మిల్లు పరిశ్రమ రిప్రజెంటెడ్ బై కొత్తమాసు వెంకట సుబ్బారావు,& ఇతరులు ....ప్రతివాదులు

టు

డి-2:కొత్తమాసు వెంకట సుబ్బారావు,S/o.వెంకట రమణ రావు,C/o. M/s. శ్రీ గాయత్రి ధాలు మిల్లు పరిశ్రమ, R/o. దుర్గి(గ్రామం & మండలం), పల్నాడు జిల్లా.

పైనెంబరు దావాను వాది ప్రతివాదులపై దాఖలుచేసియున్నారు. సదరు దావాకు సంబంధించి సమన్లు 2వ ప్రతివాది అయిన మీకు ఎన్నిమార్లు పంపిననూ మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొని యుండలేదు. కావున పైన తెలిపిన దావాలో 2వ ప్రతివాది అయిన మీకు గల ఆక్షేపణలు తెలుపుటకు శ్రీ కోర్టువారు ది. 31-01-2025కు వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉ॥గం॥10-30ని॥లకు మీరు స్వయంగా గాని మరియు లాయర్ గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు లేని యెడల సదరు దావాను మీకు పరోక్షంగా విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది:31-01-2025

కావూరి రామకృష్ణ, వాది తరపు న్యాయవాది, గురజాల, పల్నాడుజిల్లా. సెల్: 9849144606

వృత్తినే సామాజిక సేవగా భావిస్తూ వైద్య సేవలు

ప్రగతి నర్సింగ్ 50 సంవత్సరాల వేడుకల్లో సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పేద ప్రజలకు వైద్యం అందించడమే కాకుండా, తన వృత్తినే సామాజిక సేవగా భావిస్తూ వైద్య సేవలు అందించిన డాక్టర్ కొల్లా రాజామోహనరావు దంపతుల స్ఫూర్తితో డాక్టర్ కొల్లా అమర్ దంపతులు కూడా ప్రయాణిస్తూ 50 సంవత్సరాలుగా ప్రగతి నర్సింగ్‌ను ప్రజలకు చేరువ చేశారని సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు అన్నారు. ఆదివారం ప్రగతి నర్సింగ్ ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సీపీఐ నాయకులతో కలిసి డాక్టర్ కొల్లా రాజామోహన్‌రావు, డాక్టర్ కొల్లా అమర్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు చిలకలూరిపేట పట్టణంలో వైద్య సేవలు అంతగా విస్తరించని రోజుల్లో డాక్టర్ కొల్లా రాజామోహనరావు, హేమంతిదేవిల ఆధ్వర్యంలో కాన్పులు, ప్రసూతి వైద్యం, స్త్రీల సమస్యలకు సంబంధిత చికిత్సలు, చిన్నపిల్లల వైద్యం, అత్యవసర చికిత్సలకు ఈ ఆసుపత్రే కేంద్రంగా ఉండేదని, ఆరోజుల్లోనే అన్ని సదుపాయాలతో కూడిన, మెరుగైన వైద్య సేవలు చిలకలూరిపేటలోని ప్రగతి నర్సింగ్ హోమ్‌లోనే లభించేవని గుర్తు చేశారు. డాక్టర్ కొల్లా రాజామోహనరావు, హేమంతిదేవిల వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని ఆసుపత్రి బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కొల్లా అమర్, డాక్టర్ భాగ్యమాల ఆధ్వర్యంలో నాణ్యతతో కూడిన వైద్యాన్ని ప్రజలకు అందించాలన్న ఉద్దేశంతో అధునాతన సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చారన్నారు. ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా సమయంలో వేలాది మంది వైద్య సేవలు అందించి, అమర్ ఇటు ప్రజల, అటు ప్రభుత్వ ప్రశంసలు అందుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బందికి, వైద్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభాని, ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, నాయకులు సృజన్, నరసింహ భారతి తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : శ్రీకాకుళంలో ఫిబ్రవరిలో జరుగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ఏఐవైఎఫ్ నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక బొమ్మల సెంటర్ చాకలిగుంట 17వ డివిజన్‌లో ఆదివారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు చిన్నపోతుల శ్రీనివాసరావు, చల్లా మరియదాసు మాట్లాడుతూ రాష్ట్రంలోని యువతకు ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణమే నెరవేర్చాలని అన్నారు. యువతకు నిరుద్యోగ భృతి, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలు తక్షణమే భర్తీ చేయాలన్నారు. లేనిపక్షంలో గుంటూరు నగరంలో ఉన్న యువత మొత్తాన్ని సమీకరించి మరిన్ని ఆందోళన ద్వారా ఉద్యోగాలు సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకర రామారావు, రాజేష్, కృపా రావు, పవన్, తాతారావు, వివేక్ నంద తదితరులు పాల్గొన్నారు.

ఆరాధ్యుల హరిత సాయిని అభినందించిన మంత్రి లోకేష్

విశాలాంధ్ర-మంగళగిరి : గత ఏడాది నిర్వహించిన తెలుగు టైపు రైటింగ్ లోయర్ గ్రేడ్ ఎగ్జామినేషన్‌లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన మంగళగిరి మాధవి టైప్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థిని ఆరాధ్యుల హరిత సాయిని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. మంగళగిరి ఎర్రబాలెం గ్రామానికి చెందిన హరిత సాయి, మాధవి టైప్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ పి.మురళీధర, హరిత సాయి తల్లిదండ్రులకు నారా లోకేష్ అభినందనలు తెలియజేశారు.

పసుపు రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర-మంగళగిరి : దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ అగ్ని బాధిత పసుపు రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లా దుగ్గిరాల గ్రామంలో శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో అగ్ని ప్రమాదం వల్ల నిల్వ ఉన్న లక్ష బస్తాలు నిల్వ ఉన్న పసుపు దెబ్బతినడంతో రైతులు 495 మంది తీవ్రంగా నష్టపోయారని నష్టపోయిన దానికి పరిహారం చెల్లించాలని అనేక ఉద్యమాలు నిర్వహించామన్నారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం క్వింటాకు రూ.7 వేలు పరిహారం ఇస్తామని నిర్ణయం చేసి నాలుగు నెలలు పూర్తయింది. కానీ ఇంతవరకు పరిహారం అందకపోవడంతో భాదిత రైతులు తీవ్రమైన ఆవేదన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిర్ణయించిన మేరకైనా పరిహారం అందించాలని రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. అగ్నిప్రమాదం జరిగి సంవత్సరం పూర్తవుతున్న బాధిత రైతులను ఆదుకోవ దంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమిస్తామన్నారు. దానికి రాష్ట్ర ప్రభుత్వం భాధ్యత వహించవలసి ఉంటుందన్నారు.

లింగంగుంట్లలో వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పెదకూరపాడు మండలం లింగంగుంట్లలో లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.విజయ, సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ ఎన్.శ్రీని వాసరావు, సీనియర్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ విజయబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 'ఉచిత కంటి, బ్రెయిన్ క్యాంప్' నిర్వహించారు. బీపీ చెకప్, షుగర్ పరీక్ష, న్యూరాలజీ కన్సల్టేషన్, ఆప్తమాలజీ కన్సల్టేషన్, ఈసీజీ, కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందజేశారు. ఈ క్యాంప్‌లో డాక్టర్ మాలతి, డాక్టర్ సతీష్, డాక్టర్ యశ్వంత్, లింగంగుంట్ల గ్రామ పెద్దలు, పారా మెడికల్ సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, నర్సింగ్ కాలేజీ విద్యార్థులు, ఫార్మసీ విద్యార్థులు, అడ్మిన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ : పశు సంరక్షణ లక్ష్యంగా సోమవారం నుంచి వినుకొండ నియోజకవర్గవ్యాప్తంగా ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఈ నెల 20 నుంచి 31 వరకు నిర్వహించనున్న ఉచిత పశువైద్య శిబిరాలను పాడిరైతులు, పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో రోజూ మండలానికి 2 పంచాయతీల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి పశువులకు వైద్య పరీక్షలు, చికిత్సలు చేసి మందులు అందిస్తామన్నారు. దీంతో పాటు పశు సంవర్ధక శాఖ పరిధిలో అమలు చేస్తున్న వివిధ పథకాలపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు వినుకొండ మండలం నడిగడ్డలో స్వయంగా ఆయనే ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించనున్నారు. పాడి పరిశ్రమకు ప్రోత్సాహం ఇవ్వడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహద పడుతుందన్నారు చీఫ్ విప్ జీవీ. అంతేకాక పశు వైద్యం, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సదస్సులు ఉంటాయని చెప్పారు. మండలానికి రెండు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి బృందంలో ఒక పశు వైద్యాధికారి, పారా వెటర్నరీ సిబ్బంది, గోపాలమిత్ర, పశుసంవర్ధక సహాయకులు, అటెండర్లు పాల్గొంటారన్నారు.

టీపీఎల్ టోర్నీ విజేతలకు బహుమతులు

విశాలాంధ్ర - వినుకొండ : విను కొండ సమీపంలోని తెల్లబాడులో సం క్రాంతి పండగ సందర్భంగా టి.పి.ఎల్ (తెల్లబాడు ప్రీమియర్ లీగ్) టోర్నమెంట్ నిర్వహించారు. 12 టీములు పాల్గొనగా అందులో రెండు టీములు ఫైనల్ కు చేరుకున్నాయి. టోర్నమెంట్ లో తెల్లబాడు టీమ్ విజేతలుగా నిలిచారు. ముందుగా భోగి పండుగ రోజు మొదలుకొని ఆదివారం టోర్నమెంట్ ముగిసింది. ఈ సందర్భంగా ప్రథమ బహుమతి దారం అంజిరెడ్డి, దర్నాసి హనుమంత రావు తెల్లబాడు టీంకు అందజేశారు. రెండవ బహుమతి అంబడిపూడి వెంకటేష్ పాత ఉప్పలపాడు టీంకు అందజేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ తెల్లబాడు టీం సాయి కి రావడం జరిగింది. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ పాత ఉప్పలపాడు టీం కి కృష్ణ కు రావడం జరిగింది. ఈ సందర్భంగా గెలుపొందిన టీమ్ ఆనందంతో స్వీట్స్ పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లు సుబ్బారావు, విష్ణు, ఆంజనేయులు, ప్రసాద్, హనుమంతరావు, ఆదినారాయణ, పాలేమ్ రాజు, నాగరాజు, దేవరాజు, అజయ్, అజయ్ రాజు, దుర్గారావు, మహేష్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ఆరోగ్యపరంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఆదుకుంటా : డాక్టర్ లక్ష్మణ్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గురజాల పట్టణ, ప్రాంత ప్రజలకు ఆరోగ్యపరంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వైద్య సేవల రూపంలో తాను ఎప్పుడూ ముందుండి ఆదుకుంటానని కిమ్స్ శిఖర హాస్పిటల్ న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణ్ అన్నారు. తను పుట్టిన ఊరుపై ఉన్న మమకారంతో ఆదివారం ఉదయం పల్నాడు జిల్లా గురజాల పట్టణంలోని ప్రభుత్వ ఉన్న పాఠశాల నందు కిమ్స్ శిఖర హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్ చిట్టెం లక్ష్మణ్ ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం ఉదయం నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. మెదడు, నరములు, కాలేయం, గుండె, ఊపిరితిత్తులు, జనరల్ సమస్యలు, స్త్రీ సమస్యలు, చిన్న పిల్లల సమస్యలు, గ్యాస్ సమస్యలు, చెవి, ముక్కు, గొంతు సమస్యలు ఈ వైద్య శిబిరం నందు చూడబడ్డాయి. ఉచితంగా చూడటమే కాకుండా అవసరమైన వారికి మందులు కూడా అందజేశారు. అనంతరం డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ నా ఊరు నాకెంతో ఇచ్చిందని, నేను నా ఊరిని ఎప్పటికీ మరువనని అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఎప్పటికీ వైద్య పరంగా సేవలు చేస్తూ అందుబాటులో ఉంటానన్నారు. ఎటువంటి క్లిష్టతరమైన వైద్య సేవలకు హైదరాబాద్ తదితర నగరాలకు వెళ్ళే అవసరం లేకుండా అత్యాధునిక వైద్య పరికరాలు కలిగిన కిమ్స్ శిఖర హాస్పిటల్ ద్వారా ఉచితంగా ఓపీ, వైద్య పరీక్షలపై రాయితీలతో సేవలు అందిస్తామని చెప్పారు. ఈ శిబిరం నందు కిమ్స్ శిఖర హాస్పిటల్స్ యూనిట్ హెడ్ డాక్టర్ ముక్తార్, హాస్పిటల్స్ వైద్యులు, గురజాల డీఎస్పీ జగదీష్, తహశీల్దార్ శ్రీనివాసరావు, కమిషనర్ వైవీఎస్ శివన్నారాయణ, రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు సీపీఐ కార్యాలయంలో అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర మహాసభలు సందర్భంగా గోడ పత్రిక ఆవిష్కరణ జరిగినది. ఈ కార్యక్రమమునకు పొన్నూరు నియోజవర్గ ఏఐవైఎఫ్ అధ్యక్షులు పరిసరాజు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏఐవైఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య మాట్లాడుతూ రాష్ట్ర యువజన సమాఖ్య మహాసభలు ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు శ్రీకాకుళంలో జరుగుతున్నాయన్నారు. జిల్లాలోని యువజన సమాఖ్య సభ్యులందరూ సకాలంలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి రాకముందు యువతకు పెద్దపీట వేస్తామని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికి అధికారంలోకి రావడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ఇస్తారని, నిరుద్యోగ భృతి కల్పిస్తామని ఎన్నికల ముందు చెప్పి అధికారంలోకి రాగానే యువకుల్ని మరింత మోసం చేసే విధంగా ఉందన్నారు. ఇప్పటివరకు ఒక ఉద్యోగం కూడా భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలు మొత్తం భర్తీ చేసి నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మరిన్ని ఉద్యమాలు చేపట్టి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి గుంటూరు జిల్లా కార్యదర్శి అరేటి రామారావు, యువజన నాయకులు పొనుగుపాటి మురళీకృష్ణ, నిమ్మకాయల దుర్గాప్రసాద్, నిమ్మకాయల చైతన్య, రాజు, గణేష్, గేయ రచయిత దేవరకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రి గౌరీనోముల్లో ఉద్యాపన

విశాలాంధ్ర-కూచిపూడి: అగ్రహారంలో గురువారం నుంచి తొమ్మిది రోజులపాటు నిర్వహించే సావిత్రి గౌరీ నోములలో భాగంగా నాల్గరోజైన ఆదివారం ఉద్యాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. సావిత్రి గౌరీనోములు నోచుకుంటున్న మహిళలలో ఒకరైన జంధ్యాల సుజాత నిర్వహించిన ఈ కార్యక్రమంతో పాటు రోజువారి పూజలను తిలకించటానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అలాగే రెండు తెలుగు రాష్ట్రాల్లో స్థిరపడిన పలువురు కుటుంబ సభ్యులు, మహిళలు సైతం తరలిరావడంతో శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయం పురవీధి సందడిగా మారటంతో ఆ ప్రాంతం పండగ వాతావరణం నెలకొంది. మంగళ వాయిద్యాల వేదమంత్రాలు నడుమ కొనసాగిన ఈ ఉద్యాపన కార్యక్రమంలో తొమ్మిది సువాసినిలకు ప్రత్యేకపూజలు చేసి వాయనాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని పురోహితులు జోశ్యులకృష్ణ ప్రసాద్(విజయవాడ) శాస్త్రయుక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కూచిపూడిలో గడ్డివామి దగ్ధం

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండలం కూచిపూడి పక్కులబీడు 3వ వార్డులో ఆదివారం మధ్యాహ్నం వెన్నంశివ అర్జునరావు (కాకాని)కు చెందిన వరిగడ్డి వామి దగ్ధమైంది. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. రెండు ఎకరాల గడ్డివామి దగ్ధమవగా సమాచారం అందుకున్న మొవ్వఫైర్ ఆఫీసర్ కొణతం వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సిబ్బంది సహకారంతో మంటలను అదుపు చేశారు.

అమిత్‌షా సభకు తరలిన బీజేపీ శ్రేణులు

విశాలాంధ్ర - గుడివాడ : హోం మంత్రి అమిషా గన్నవరం నియోజవర్గంలోని కొండపావులూరులో జరిగే సభకు వెళ్ళే 2 బస్సులకు ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు జెండాను ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, జిల్లా నాయకులు సురే గాంధీ, యర్రబోతు అర్జున్, నాయకులు కె.కె.డి ప్రసాద్, మాచర్ల రమకృష్ణ, వాసుపల్లి రాంప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి సమస్య పరిష్కార దిశగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఈ సోమవారం కూడా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో కూడా నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థకు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు సంప్రదించవచ్చని, అధికారులు ఫిర్యాదులను స్వీకరిస్తారని తెలిపారు. నగర ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు.

యోగా దినచర్యలో భాగం కావాలి: ఎంపీపీ

విశాలాంధ్ర - ఘంటసాల : నిత్యజీవితంలో యోగా చేయటం వల్ల శరీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడుతుందని చల్లపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు, పూర్వపు యోగ సాధకురాలు కోట విజయ రాధిక అన్నారు. ఘంటసాల మండలం లంకపల్లిలోని సత్య సాయి ధ్యానమండలిలో శ్రీ యోగ శ్రీనివాస గురూజీ ఆధ్వర్యంలో 12న ప్రారంభమైన బాలల వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ యాంత్రికంగా పనిచేయాల్సి వస్తుందని ఈ ఒత్తిడి నుంచి బయటపడటానికి ప్రతి ఒక్కరికి యోగా ఎంతో అవసరన్నారు. మానసిక ఒత్తిడి కారణంగా మనిషి అనారోగ్యం పాలవుతున్నాడని యోగ, ధ్యానం ద్వారా ఒత్తిడిని జయించి మానసిక, శారీరక ప్రశాంతత పొందవచ్చునని పేర్కొన్నారు. శిక్షణా తరగతుల్లో భాగంగా నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన బాల బాలికలకు ఆమె చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. నేపథ్య గాయకుడు పెనుమాక వెంకటకృష్ణ ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చల్లపల్లి మాజీ ఎంపీపీ బొలెం నాగమణి, యోగ సాధకులు బోలేం రామారావు, సద్గుణ రావు గురూజీ, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ముందుగా అతిథులను యోగ శ్రీనివాస్ గురూజీ శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. అలాగే 26 నుంచి ధ్యాన యోగ ఆధ్యాత్మిక శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, ధ్యాన మండలి నిర్వాహకులు యోగ శ్రీనివాస్ గురూజీ తెలిపారు. ఈ శిక్షణ తరగతులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సార్వజనీనత సమకాలీనతకు చిహ్నం వేమన పద్యం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్: వేమన పద్యాలు సార్వజనీనత సమకాలీనతకు చిహ్నాలని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. మోదుకూరు వేమన జయంతి ఉత్సవ కమిటీ, సమైక్య భారతి, కామ్రేడ్ జి ఆర్ కె పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయం కళా వేదికపై వేమన జయంతి కార్యక్రమం జరిగింది. అతిథులుగా జాతీయ సమన్వయకర్త సమైక్య భారతి పి కన్నయ్య, ఆంధ్రా లయోలా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ జి కిరణ్ కుమార్, వేమన జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఆచార్య ముమ్మ శ్రీనివాసరెడ్డి, రచయిత ఎమ్ ప్రభాకర్, ప్రసంగ ప్రజ్ఞానిధి ఆచార్య గుమ్మా సాంబశివరావు ప్రజా గాయకుడు ఆర్ పిచ్చయ్య, కవి చందు నాగేశ్వరరావు, చింతకాయల చిట్టిబాబు, పాత్రికేయుడు జయప్రకాష్ లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వేమన పద్యాలు ఆణిముత్యాలని, వేమన సంఘసంస్కర్త, తత్వవేత్త, దార్శనికుడు, వైతాళికుడు అని అన్నారు. తల్లిదండ్రులు, విద్యాలయాలు బాల్యం నుంచి పిల్లలకు వేమన శతకం పట్ల అవగాహన కలిగిస్తూ నేర్పించవలసిన అవసరం నేటి సమాజానికి ఎంతో అవసరమని, భాష పై కూడా అనురక్తి పెరుగుతుందని అన్నారు. ప్రారంభంలో జరిగింది సినీ సంగీత విభావరిలో దేవిడ్ రాజు, ఆదిరాల జయప్రభ, స్వాతి, అయ్యప్పన్, శ్రావణి, వెంకటేష్ లు పలు చిత్రాలలోని పాటలను శ్రావ్యంగా పాడి వినిపించారు.

మీ కోసం కార్యక్రమం నిర్వహిస్తాం

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : కలెక్టరేట్ సమావేశ మందిరంలో 20వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే. బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు మాత్రం ఉదయం 9 గంటలకే హాజరు కావాలని జిల్లా కలెక్టర్ డీకే. బాలాజీ సూచించారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలో సమర్పించుకోవచ్చని అన్నారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా జిల్లా కలెక్టర్ ప్రజలను కోరారు.

అధైర్య పడొద్దు..అండగా ఉంటా: ఎమ్మెల్యే ఏలూరి

విశాలాంధ్ర - చినగంజాం : చిన్నగంజాం మండలంలో ఆదివారం పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు పర్యటించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ కలాం ఆజాద్ సతీమణి సయ్యద్ ఖాజున్నీసా బీబీ ఇటీవలె మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం అబ్దుల్ కలాం ఆజాద్ను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.

విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్లు ప్రకటించడం హర్షనీయం

విశాలాంధ్ర-అవనిగడ్డ: విశాఖ ఉక్కు కర్మాకారానికి కేంద్ర ప్రభుత్వం 11,400 కోట్ల రూపాయల ప్రకటించడంపై కృష్ణాజిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కొండవీటి సునీత హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కోడూరులో ఆమె మాట్లాడుతూ 2021 సెప్టెంబర్ 21వ తేదీన జనసేన పార్టీ అధినేత,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో డిజిటల్ క్యాంపెయిన్ ప్రారంభించారని, విశాఖ ఉక్కును కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారని ఆమె తెలిపారు. ప్రపంచం మొత్తం విశాఖ ఉక్కు గురించి తెలిసే విధంగా పవన్ కళ్యాణ్ అనేక కార్యక్రమాలు చేపట్టారని సునీత అన్నారు. అప్పటిలో పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపుమేరకు కోడూరు మండలంలో కూడా ప్లకార్డు లు పట్టుకుని యాష్ ట్యాగ్‌తో అప్పటి వైసిపి ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీశామని, విశాఖ ఉక్కును ప్రైవేటీకరం చేస్తే సహించేది లేదని జనసేన పార్టీ తరపున గట్టిగా డిమాండ్ చేశామని ఆమె గుర్తు చేశారు. పవన్ కళ్యాణ్ విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడడం కోసం నిరంతరం పోరాటం చేశారని, అనేక సందర్భాల్లో భారత ప్రధాని నరేంద్ర మోడీ దృష్టికి విశాఖ ఉక్కు పరిశ్రమ గురించి పవన్ కళ్యాణ్ తీసుకొని వెళ్లారని, పవన్ కళ్యాణ్ పోరాటాలు, విజ్ఞప్తితో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీ నేతలు,ఎన్నికలలో ఇచ్చిన మాటకు కట్టుబడి శుక్రవారంనాడు కేంద్ర ప్రభుత్వం,భారత ప్రధాని నరేంద్ర మోడీ 11,400 కోట్ల రూపాయలను విశాఖ ఉక్కు కర్మాగారానికి కేటాయిస్తున్నట్లు ప్రకటించడం చాలా సంతోషంగా వుందని ఆమె అన్నారు.

కేపీ రెడ్డయ్య వర్ధంతి

విశాలాంధ్ర-కూచి పూడి: మొవ్వ మండలం అయ్యంకి శివారు కారకంపాడు గ్రామంలో ఆదివారం నిర్వహించిన బందరు పార్లమెంటు మాజీ సభ్యులు, ఉయ్యూరు మాజీ శాసనసభ్యులు కేపీ రెడ్డయ్య వర్ధంతి కార్యక్రమానికి పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా హాజరై ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. రెడ్డయ్య కుమారులైన ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసుపార్థసారథి, కొలుసు వివి సుబ్బారావు, కొలుసు కృష్ణ కాంత్ యాదవ్ తమ కుటుంబ సభ్యులతో వర్ధంతి కార్యక్రమానికి హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని పురోహితులు జంధ్యాల పాండురంగ శర్మ (కూచిపూడి) ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు కొనసాగించగా పలువురు తెలుగుదేశం నాయకులతో పాటు గ్రామస్తులు హాజరై ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.

పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-పమిడిముక్కల: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని పశువైద్య అధికారుల రామ్ నరేష్ (వీరంకిలాకు) వెంకటేష్ (కపిలేశ్వరపురం) ఈశ్వర్ (కృష్ణాపురం)ల పర్యవేక్షణలో ఈ నెల 20వ తేది నుంచి 31 వరకు గ్రామాల్లో నిర్వహించే పశుపోషకులు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రామ్ నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా 20వ తేదీన (పమిడిముక్కల కృష్ణాపురం మామిళ్ళపల్లి) 21వ తేదీన(కూడేరు, పైడికొండలపాలెం) 22న (ఐనపూరు వీరంకి) 23న(పెనుమత్స అమీనపురం)24న (చోరగుడి, ఐనంపూడి) 25న (అలినఖీపాలెం వేల్పూరు) 27న (మేడూరు మంటాడ) 28న(లంకపల్లి శ్రీరంగాపురం గోపువానిపాలెం మర్రివాడ) 29న (కపిలేశ్వరపురం గురజాడ) 30న (ముళ్ళపూడి తాడంకి)31న (హనుమంతపురం,అగినపర్రు,బొద్దువానిగూడెం) లలో పశువులకు నులిపురుగులు నివారణ,గాళ్ళుకి మందు కోళ్ళకు తెగుళ్ళు ఇంజెక్షన్లు వేస్తారని పశు యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బుద్ధి రాయప్ప గృహనిర్బంధం

విశాలాంధ్ర - విజయవాడ (వన్ టౌన్): నగరం లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పర్యటన వ్యతిరేకిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమానికి వస్తున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్పను పోలీసులు గృహనిర్బంధం చేశారు.

విశాలాంధ్ర

వేములపల్లి సురేష్ దాతృత్వంతో ఒకరికి కంటి చూపు

విశాలాంధ్ర - చల్లపల్లి: ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ దాతృత్వంతో ఒక వ్యక్తికి కంటిచూపు లభించింది. పెనమలూరు మండలం చోడవరం గ్రామానికి చెందిన కాకాని గౌరీశంకర్ విజయవాడ పీవీపీ సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ల్యాబ్ అసిస్టెంటుగా పని చేస్తున్నాడు. అతను కంటిలోని రెటీనాను ప్రభావితం చేసి రాత్రి అంధత్వం బారిన పడి క్రమేపి పరిధి, రంగు కోల్పోయి కేంద్ర దృష్టిని కోల్పోయి అంధత్వం బారిన పడేసే రెటినిటిస్ పిగ్మెంటోసా అనే వ్యాధితో బాధపడుతూ ఇటీవల ఆర్థిక సహాయం కోసం మండల పరిధిలోని పురిటిగడ్డలో ఉన్న ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ - రోజా దంపతులను సంప్రదించి సహాయం కోరాడు. దీంతో అతనికి సురేష్ - రోజా దంపతులు తమ ఐవీఎం ఫౌండేషన్ ద్వారా రూ.50 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. తద్వారా గౌరీ శంకర్ ఆపరేషన్ విజయవంతంగా చేయించుకుని కోలుకుంటున్నాడు. తనకు సహాయం చేసిన ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ - రోజా దంపతులకు కృతజ్ఞతలు తెలిపాడు.

ప్రత్యేక అలంకరణలో స్వామి

విశాలాంధ్ర-అవనిగడ్డ: ఉషా పద్మినీ సమేత సూర్య నారాయణ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. మండల పరిధిలోని వేకనూరు గ్రామంలో వేంచేసి ఉన్న ఉషాపద్మిని సమేత సూర్య నారాయణ స్వామి వారికి ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు దివి నరసింహమూర్తి స్వామివారికి వేకువజామునే కృష్ణానది జలాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించి విశేషంగా అలంకరించారు సుదీర్ఘ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త తుంగల వీర వసంతరావు ఇందిరా దంపతులు పర్యవేక్షించారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

విశాలాంధ్ర-అవనిగడ్డ: ప్రముఖ పారిశ్రామికవేత్త కూటమి నాయకులు వెంకట శ్రీనివాసరావు అవనిగడ్డ ఆరో వార్డుకు చెందిన నూతన వధూవరులకు ఆశీస్సులు అందించారు భాషిద్ బాబా కుమార్తె నజ్మా వరుడు సత్తార్ దంపతులకు ఆదివారం వివాహం కాగా వికృతి వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి ఆశీస్సులు అందజేశారు వికృతితో పాటు షేక్ ఖలీల్, అబ్దుల్ అజీజ్, షేక్ నజీర్, భాష, అబ్దుల్ రెహమాన్, పులిగడ్డ చంద్ర, బర్మా శ్రీను లతో పాటు పలువురు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి ఎన్టీఆర్ కృషి

విశాలాంధ్ర - కనిగిరి : పట్టణంలోని స్థానిక అమరావతి గ్రౌండ్ నందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక అమరావతి గ్రౌండ్ నందు నియోజకవర్గ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి నందమూరి తారకరామారావు ఎనలేని కృషి చేశారని కూడు, గుడ్డ, గూడు, పేరుతో పేదలకు కిలో బియ్యం రెండు రూపాయలకు అందించిన ఘనత ఒక్క ఎన్ టీ రామారావుకే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ చల్లపల్లికి లోకానాయక్ ఫౌండేషన్ పురస్కారం

విశాలాంధ్ర - చల్లపల్లి: దశాబ్ద కాలంగా చల్లపల్లిలో జరుగుతున్న స్వచ్ఛ చల్లపల్లి సేవా ఉద్యమానికి లోక్నాయక్ ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారం లభించింది. విశాఖపట్నంలో లోక్నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పుణ్యతిథి, ఏఎన్ఆర్ శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా వివిధ రంగాల్లో ప్రముఖులకు పురస్కారాలను అందించి సత్కరించారు. స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమంతో దేశానికే స్ఫూర్తిగా నిలిచిన వైద్య దంపతులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతిలను ఫౌండేషన్ పురస్కారానికి ఎంపికచేశారు. అనివార్య కారణాలవలన వారు వెళ్లలేకపోవటంతో స్వచ్ఛ చల్లపల్లి ప్రతినిధిగా విశ్రాంత ఉపాధ్యాయులు, స్వచ్ఛ కార్యకర్త ప్రాతూరి ఉదయ శంకర శాస్త్రి పురస్కారాన్ని స్వీకరించారు. త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి, సినీనటులు బ్రహ్మానందం, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఫౌండేషన్ నిర్వాహకులు, మాజీ రాజ్యసభ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పురస్కారం, లక్ష రూపాయల నగదు అందించి శాస్త్రిని సత్కరించారు.

పరిష్కార వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకి పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యా దుల పరిష్కార వ్యవస్థను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు చెప్పారు. అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీ పంలోని మండల కార్యాలయాలు, డివిజనల్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చని అన్నారు.

రైలు ప్రయాణికుడు మృతి

విశాలాంధ్ర-రెంటచింతల : సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చిన కుమార్తెను తిరిగి గుంటూరుకు పంపే క్రమంలో తండ్రి మృత్యుబాట పట్టాడు. స్వగ్రామంలో విషాదం అలుపుకున్న ఘటనపై వివరాలిలా ఉన్నాయి. పాలువాయికి చెందిన తమ్మిశెట్టి ఏడుకొండలు (42) ఆదివారం ఉదయాన్నే స్థానిక రైల్వే స్టేషన్‌కు కుమార్తెను తీసుకొచ్చాడు. రైలు మాచర్ల నుండి రెంటచింతలకు ఉదయాన్నే 5.55 గంటలకు చేరింది. ప్లాట్ఫాంపై అధిక సంఖ్యలో ఉన్న ప్రయాణీకులు రైలు ఎక్కేందుకు ఒక్కసారిగా ప్రయత్నించారు. స్రవంతిని ఎక్కించాడు. ఏడుకొండలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి రైలుపట్టాలపై పట్టాడు. చేతికి, కాళ్లకు బలమైన గాయాలు కావటంతో క్షణాలలో మృతి చెందాడు. కొండలుకు భార్య పద్మ కుమారుడు శ్యాం, కుమార్తె స్రవంతిలు సంతానంగా ఉన్నారు. నడికుడి రైల్వే ఎస్సై వెంకట్రావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. శవపంచనామ నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు.

తిరుమలదేవికి పూలే నేషనల్ ప్రతిభా అవార్డు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెంకు చెందిన కస్తూరిబా బాలికా విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్.తిరుమలదేవికి ఉపాధ్యాయ విద్యకు, పేద విద్యార్థులకు అందించిన సేవలకు గాను సౌథెర్న్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఎస్పీ యల్ టీ ఓ) సంస్థ గౌరవాధ్యక్షులు ఎమ్మెల్సీ కే. లక్ష్మణరావు, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పాయర్ల, నాగయ్య చేతుల మీదుగా సావిత్రి బాయి పూలే నేషనల్ ప్రతిభా అవార్డు ను ఆదివారం గుంటూరు లోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం లో జరిగిన సావిత్రి బాయి పూలే జయంతి కార్యక్రమం లో అందుకున్నారు. ఈ సందర్భంగా తిరుమల దేవి మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా పేద విద్యార్థులకు, బాలికా విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తానని తెలిపారు.

ఆసుపత్రికి కుర్చీల వితరణ

విశాలాంధ్ర-పెదకూరపాడు : ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని గ్రామస్థాయిలో ఎన్టీఆర్‌కు ఘన నివాళులర్పించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలంటూ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు పెదకూరపాడు మండల తెలుగు యువత అధ్యక్షులు గల్లా శివ సొంత నిధులతో ఆసుపత్రి వైద్య సిబ్బంది కూర్చునేందుకు వీలుగా పది కుర్చీలు సమకూర్చారు. ఆదివారం జిల్లా తెలుగు దేశం కార్యదర్శి అర్తిమళ్ల రమేష్ చేతుల మీదుగా వైద్య సిబ్బందికి వాటినందించారు. ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని మండల పార్టీ అధ్యక్షుడు రమేష్ అన్నారు. దాతలు మరింత మంది ముందుకు వచ్చి ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. దాత గల్లా శివ, జిల్లా పార్టీ కార్యదర్శి రమేష్‌ను వైద్య బృందం దుశ్శాలువాతో సత్కరించారు. వారి వెంట నేతలు మక్కెన సాగర్, నెల్లూరి మల్లికార్జున్, గుడిపూడి చినరాజు, పాటిబండ్ల యోహాను, చెన్నుపాటి బుల్లిబాబు, రాయి వేణు, సయ్యద్ ఖాసిం, మస్తాన్ షరీఫ్, మలాట్ రఫీ, పర్వేజ్, ముంతాజ్, సరిపూడి కృష్ణకుమారి పాల్గొన్నారు.

తమ మొదటి ఎలక్ట్రిక్ ఎస్యూవీ ఈవిటారాను విడుదల చేసిన మారుతి సుజుకీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) తమ మొదటి బి-ఈవీ (బ్యాటరీ ఎలక్ట్రిక్ వెహికల్)- ఎస్యూవీ ఈవిటారాను సమగ్రమైన 'ఈ ఫర్ మీ' ఎలక్ట్రిక్ పర్యావరణ పరిష్కారాలతో పాటు భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్ పో 2025ను ప్రారంభించింది. హియర్టెక్ట్-ఈ ప్లాట్‌ఫాంపై నిర్మితమైన, ఈవిటారా గొప్ప సామర్థ్యాన్ని, అమోఘమైన శ్రేణిని సాటి లేని సౌకర్యం, భద్రతతో అందిస్తోంది. ప్రీమియం నెక్సా ఛానల్లో పరిచయం చేయబడటానికి సిద్ధంగా ఉన్న ఈవిటారా నెక్సా కీలకమైన విలువైన వినూత్నత, ఆధునికత, ప్రీమియం కస్టమర్ అనుభవానికి చిహ్నంగా నిలిచింది.

వినియోగదారులు సహకరించాలి

నేటి నుంచి గుణదల సబ్ స్టేషన్‌లో హెచ్‌వీ బ్రేకర్ మార్పు పనులు

విశాలాంధ్ర-విజయవాడ : విద్యుత్ వినియోగదారులు సహకరించాలని నేటి నుంచి గుణదల సబ్ స్టేషన్‌లో హెచ్‌వీ బ్రేకర్ మార్పు పనులు జరుగుతాయని కార్యనిర్వాహక ఇంజనీర్ ఎం.కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20 నుంచి 22వతేదీ వరకు మూడు రోజుల పాటు ఏపీ ట్రాన్స్‌కో 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రం గుణదలలో 160 ఎంవీఏ పవన్ ట్రాన్స్‌ఫార్మర్ హెచ్‌వీ బ్రేకర్ మార్పు పనులు జరుగుతాయని అన్నారు. 220 కేవీ గుణదల సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తారన్నారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు అంతరాయం కలుగకుండా తగిన ప్రత్యామ్నాయం చేశారన్నారు. ఒక వేళ ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు విద్యుత్ అంతరాయం కలుగుతోందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వికృతి భరోసా ఆదర్శనీయం

విశాలాంధ్ర-అవనిగడ్డ: ప్రముఖ పారిశ్రామిక వేత్త యువనేత వికృతి శ్రీనివాస్ అందించిన భరోసా పలువురికి ఆదర్శనీయమని పేర్కొంటున్నారు. మోపిదేవి ప్రశాంత్ నగర్ వాసి నాగమణి షుగర్ వ్యాధితో తమ రెండు కాళ్లు సచ్చుబడి అనేక హాస్పిటల్లో తిరిగినప్పటికిని ప్రయోజనం లేకపోవడంతో రెండు కాళ్లు తొలగించవలసిన పరిస్థితి ఏర్పడినది. ప్రస్తుతం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి నుండి తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించడానికి వారి చేతిలో కనీసం ప్రయాణ ఖర్చులకు కూడా చేతిలో చిల్లి లేకపోవడంతో విషయం తెలుసుకున్న వికృతి ఆదివారం వెంటనే స్పందించి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించి రుయా ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించే అందుకు కృషి చేయాలని కోరారు. దీంతో బాధితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు,

త్రైమాసిక పన్నును చెల్లించాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : సాంకేతిక సమస్యలు అధిగ మించేందుకు గాను ఈ త్రైమాసిక పన్నును వారం రోజులు ముందుగానే చెల్లించాలని జిల్లా రవాణా శాఖ అధికారి టి.కె.పరంధామ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 31 లోపు చెల్లించాలని పన్నులను నేషనల్ సాఫ్ట్‌వేర్ ద్వారా చెల్లించవలసి ఉన్నందున ఇ-కెవైసి,మండల్ మాపింగ్‌లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు.

మాతృభాషలకు కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత: మండలి

విశాలాంధ్ర-అవనిగడ్డ: భారత ప్రభుత్వం మాతృభాషలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఏపీ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ నార్సింగి ఓం కన్వెన్షన్ లో తెలుగు సంగమం సంక్రాంతి సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ మహోత్సవంలో గౌరవ అతిథిగా విచ్చేసిన మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ భారతదేశ ప్రధాని నరేంద్రమోడీ జాతీయ విద్యా విధానం ద్వారా ప్రాథమిక విద్యా బోధన మాతృభాషలోనే జరగాలని ఇచ్చిన ఆదేశాలు తెలుగు రాష్ట్రాల్లో అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జాతీయ విద్యా విధానం తప్పనిసరిగా అమలైతే తెలుగు భాషతో పాటు అన్ని మాతృభాషలు సజీవంగా ఉంటాయన్నారు. ఇంజనీరింగ్ విద్య కూడా మాతృభాషలో చదవటానికి భారత ప్రభుత్వం అవకాశం ఇచ్చిందన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో విద్యా విధానంలో తెలుగు తరిగిపోతోందన్నారు. తెలుగు భాష పరిరక్షణకు మహోద్యమాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు భాష మాట్లాడటం, తెలుగు వారిగా జన్మించటం ఎన్నో జన్మల తపఃఫలం అన్నారు. తమిళ జాతిని ప్రాచీన జాతిగా గుర్తిస్తే వెయ్యి డాలర్లు ఇస్తామని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఇటీవల ప్రకటించారన్నారు. తెలుగు సంగమం స్థాపక అధ్యక్షులు, బీజేపీ జాతీయ నాయకులు పీ మురళీధర్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లూరి ఇంద్రసేనారెడ్డి, గౌరవ అతిథులుగా ప్రముఖ హీరో రాజేంద్రప్రసాద్, సిలికానాంధ్ర వ్యవస్థాపకులు డాక్టర్ కూచిభొట్ల ఆనంద్, ప్రముఖ గాయకులు డాక్టర్ ఎల్ వీ గంగాధర శాస్త్రి విచ్చేశారు. విశ్వ యోగి విశ్వంజీ మహారాజ్ విచ్చేసి ఆశీర్వచనం అందచేశారు. ఈ సందర్భంగా అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అంబేద్కర్ స్మృతివనంలో దళిత సంఘాల నిరసన

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మంత్రి మండలి నుంచి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని, దేశ ప్రజలకు అమిత్ షా క్షమాపణలు చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. ఆదివారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటను వ్యతిరేకిస్తూ విజయవాడ బందరురోడ్డులోని అంబేద్కర్ స్మృతివనంలో దళిత సంఘాలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పదేళ్లుగా పాలిస్తున్న బీజేపీ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతూ, అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఆనవాళ్లను తుడిచి వేయాలనే ఆలోచన చేస్తుందన్నారు. పార్లమెంట్‌లో అమిత్‌షా మాట్లాడుతూ మాటిమాటికి అంబేద్కర్ అనడం కంటే దేవుని ప్రార్తిస్తే మంచిదని చెప్పడం ఏదైతే ఉందో దానిని దేశ ప్రజలందరూ ఖండిస్తున్నారన్నారు. దేశ స్వాతంత్ర పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించి దేశానికి రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ ఆనవాళ్లు తుడిచే ప్రయత్నం చేస్తున్న బీజేపీకి రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. పార్లమెంట్‌లో అంబేద్కర్ గురించి అమిత్ షా హేళనగా మాట్లాడారన్నారు. అంటరానితనాన్ని నిర్మూలించేందుకు అంబేద్కర్ తన జీవితకాలం పోరాటం సాగించారని, అటువంటి మహనీయుడిని హేళన చేసిన విషయాన్ని దేశమంతా గమనిస్తోందన్నారు. ప్రధాని మోదీ అమిత్‌షాకు మద్దతు ఇవ్వడం సిగ్గుమాలిన చర్య అన్నారు. రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడికి ఇచ్చిన గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఆంధ్ర మాల్యాద్రి, నటరాజ్, జి.క్రాంతి కుమార్, చింతల శ్రీనివాస్, జి.అరుణమ్మ, జైభీమ్ పార్టీ అధికార ప్రతినిధి జి.కొండలరావు, అంబేద్కర్ మిషన్ అధ్యక్షులు గంజి రామారావు, ఆమ్‌ఆద్మీ పార్టీ కోఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు, ఆల్ ఇండియా కిసాన్ సంఘటన అధ్యక్షులు మరీదు ప్రసాద్ బాబు, చింతా వెంకటేశ్వర్లు, కొప్పుల విజయ్, వి.కృష్ణ, న్యాయవాది శ్యామ్, సురేష్, ముస్లీం లీగ్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు కాకోతు ఈశ్వరరావు, గద్దం నగేష్, కిరణ్, పల్లే బాబు పాల్గొన్నారు.

అనధికార కుళాయిల తొలగింపుపై ప్రత్యేక డ్రైవ్: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరంలో వార్డు సచివాలయాల వారీగా అనధికార కుళాయిల తొలగింపుపై ఇంజినీరింగ్, రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం కమిషనర్ శ్యామలనగర్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, బ్రాడీపేట, లక్ష్మీపురం, పెద్దపలకలూరు రోడ్ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను, గుజ్జనగుండ్ల సెంటర్‌లో వెండింగ్ జోన్ ప్రతిపాదిత ప్రాంతాలను పరిశీలించారు. తొలుత శ్యామలా నగర్‌లో నిర్మాణంలో ఉన్న అపార్ట్మెంట్‌కు అనధికారికంగా మున్సిపల్ ట్యాప్‌లు ఉండటం కమిషనర్ గమనించి, సంబంధిత పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి తక్షణం డిస్ కనెక్షన్ చేయాలని ఆదేశించారు. నూతన భవన నిర్మాణ ప్లాన్ మంజూరుకి ముందే గతంలో ఉండే హౌస్ ట్యాప్ కనెక్షన్‌ని తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టం చేశారు. బహుళ అంతస్తు భవనాల్లో ఫ్లాట్ల వారీగా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం వేచి ఉండకుండా ఆస్తి పన్ను విధించాలని అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. అలాగే భవనాల ర్యాంప్‌లు రోడ్ల మీదకు రాకుండా, బహుళ అంతస్తు భవనాలు డ్రైన్‌ను అవుట్ ఫాల్ డ్రైన్ వరకు కనెక్ట్ చేయాలన్నారు. అలాగే నివాస ప్రాంతాల్లో గేదెల డైరీ ఏర్పాటు చేసి, వ్యర్థాలను డ్రైన్‌లోకి వదులుతున్న వారికి నోటీసులు జారీ చేయాలని శానిటరీ ఇన్స్పెక్టర్‌ను ఆదేశించారు. పలు ప్రదేశాల్లో డ్రైన్లు శుభ్రం చేయడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రతి రోజు మధ్యాహ్నం సమయంలో గ్యాంగ్ వర్క్ ద్వారా కాల్వలు శుభ్రం చేయాలని, డెబ్రిస్‌ని ప్రత్యేకంగా ట్రాక్టర్లను తీసుకొని లిఫ్ట్ చేయాలని ఆదేశించారు. అనంతరం కమిషనర్ గుజ్జనగుండ్ల ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్ మానం పద్మశ్రీ, పట్టణ ప్రణాళిక అధికారులు, స్ట్రీట్ వెండర్స్ కలిసి పర్యటించి, త్వరలో గుజ్జనగుండ్ల ప్రాంత వీధి వ్యాపారులకు అనువుగా ఉండేలా వెండింగ్ జోన్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, వెంకటేశ్వరరావు, డిఈఈలు రమేష్ బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రజక విద్య సేవా సంఘం డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రజక ఉద్యోగస్తుల సంఘం ఆధ్వర్యంలో రజక విద్య సేవా సంఘం యొక్క డైరీలను గుంటూరు పశ్చిమ నియోజకవర్గం శాసనసభ సభ్యురాలు గళ్ళా మాధవి ఆదివారం తన కార్యాలయంలో ఆవిష్కరించడం జరిగినది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ.....ప్రతిభావంతులైన పేద, మధ్య తరగతి రజక విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడమే గాక, విద్యార్థులకు భవిష్యత్ ప్రణాళిక ఇవ్వడమే ముఖ్య ధ్యేయంగా విద్యా సేవా సంఘాన్ని ఏర్పాటుచేశారని, వీరిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు, ఇటువంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో రజక విద్యా పరిషత్ వ్యవస్థాపకులు అమృతలూరు సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రజక ఉద్యోగస్తుల సంఘం (అదఆర్) జనరల్ సెక్రెటరీ పొదిలి దుర్గాప్రసాద్, వేంపాటి పాపారావు, ఏనుముల మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ఐఎఎఫ్ఎస్ డిప్యూటీ డైరెక్టర్

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని అడిగొప్పల శివారు నిదానంపాడులో వేంచేసియున్న శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారిని ఆదివారం ఐఎఎఫ్ఎస్ డిప్యూటీ డైరెక్టర్ జీఓఐ మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్(హైదరాబాద్) అధికారి జి.మధుబాబు దంపతులు దర్శించుకున్నారు. వారి రెండవ బాబు అన్నప్రాసన కార్యక్రమం నిమిత్తం దేవస్థానం వద్దకు విచ్చేశారు. వీరికి ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు, అన్నప్రాసన కార్యక్రమం తదుపరి ఆలయ అర్చకులచే వేద ఆశీర్వచనం,శేష వస్త్రబహుకరణతో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఛైర్మన్ యాగంటి వెంకటేశ్వర్లు, ఆలయ సహాయ కమీషనర్ అండ్ కార్యనిర్వాహణాధికారి పి.సైదమ్మబాయి, సిబ్బంది సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : పేద ప్రజల ఆరోగ్య రక్షణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణ టీడీపీ కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వివిధ రకాల వ్యాధులు బారిన పడి వైద్యం కోసం ఇబ్బందిపడుతున్న 23 మంది బాధితులకు రూ.41,30,000ల విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ దాచేపల్లికి చెందిన దాసరి కోటయ్య అనే ఐదేళ్ల బాలుడు ప్లేట్లెట్లు, రక్త సమస్యతో బాధపడుతుంటే వైద్య సేవల కోసం రూ.10 లక్షలు సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందించామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పేదల ఆరోగ్య సేవలో కోసం సీఎం సహాయనిధి నుంచి రూ.10 వేలు, రూ.20 వేలు మొక్కుబడి సహాయం అందించిన పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో గత అరాచక ప్రభుత్వం చేసిన విధ్వంసాలను సరిచేస్తూ అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని పయనింపచేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు అనుభవంతో పాటు కేంద్రం సాయంతో కోట్ల రూపాయల విలువైన సాగు నీటి ప్రాజెక్టులు, రాజధాని నిర్మాణం, గోతులమయమైన రహదారుల అభివృద్ధి లాంటి పనులన్నీ జరుగుతున్నట్లు యరపతినేని గుర్తుచేశారు. పంపిణీలో మండల కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు, పట్టణ పార్టీ అధ్యక్షులు గొంట్ల శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకుడు వడ్డవల్లి సర్వేశ్వరరావు, కనిగిరి శ్రీనివాసరావు, ఎల్‌వీఆర్ పిల్లి చెన్నారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-త్రిపురాంతకం : ఇటీవల కాలంలో త్రిపురాంతకం మండల కేంద్రంలో గుర్తు తెలియని మృతదేహం కలకలం రేపింది. అయితే పోలీసులు ఆ మృతదేహం వివరాలు తెలియక పోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో త్రిపురాంతకం మండల కేంద్రానికి చెందిన మెంద్రగుత్తి మహాకాళి 35 కనిపించడం లేదని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం అందించారు.

సంగీత సద్గురువుకు స్వర హారతులు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్: భారతీయ శాస్త్రీయ సంగీతం భక్తితో ముడి పడి ఉంది. ప్రకృతిని సైతం పరవశింపచేసే ఆ సంగీతం భక్తునిలో ఆధ్యాత్మిక చింతనను వృద్ధి చేస్తూ భగవంతుని ప్రసన్నం చేసుకోవడానికి సోపానంగా నిలుస్తుంది. సామవేదం నుంచి సంగీతం ఆవిర్భవించిందని త్యాగరాజ స్వామి తన కీర్తన ద్వారా సామవేద సారం వారం వారం అని పేర్కొన్నారు. ఉత్కృష్టమైన భారతీయ సంగీతంతో భగవంతుని నవవిధ భక్తి మార్గాలలో పూజించి తరించిన ఎందరో వాగ్గేయకారులు కీర్తనలను, సంకీర్తనలను, తరంగాలను, పదాలను, అభంగాలను మనకు అందించి శాశ్వతులయ్యారు. ఆధ్యాత్మిక చింతనతో పాటు భక్తి భావాన్ని వేదాంత సారాన్ని, మానవీయ విలువలను వారి వారి రచనల ద్వారా దాదాపు ఏడు శతాబ్దాల క్రితమే మనకు అందించారు. సంగీత మూర్తిత్రయంలో ఒకరు సంగీత సద్గురువుగా పూజలందుకుంటున్న త్యాగరాజస్వామి వారు కర్ణాటక సంగీతానికి ఆరాధ్యుడు. రామతారకమంత్రోపాసన చేసి ఆరాధిస్తూ జన్మరాహిత్యాన్ని తాను పొంది ఆ మార్గాన్ని మనకు చూపారు త్యాగరాజస్వామి. రామ నామ తారక మంత్రాన్ని నూరు కోట్లు జపించి భగవత్సాక్షాత్కారం పొందిన యోగ పురుషుడు, కారణజన్ముడు. 1767 వ సంవత్సరంలో మే 4వ తేదీన సర్వజిత్ నామ సంవత్సర చైత్ర బహుళ దశమి సోమవారం పూర్వాషాడ నక్షత్ర కటక లగ్నంలో త్యాగయ్య జన్మించారు. కీర్తి, కాంత, కనకం లకు దూరంగా ఉంటూ కేవలం భగవంతుడిని ప్రసన్నం చేసుకోవడానికే తన గానం, జీవనం, గమనం అని భావించి తరించిన ఆయన కీర్తనల లోని భావానికి అనుగుణంగా రాగాన్ని సమకూర్చి అందించిన త్యాగరాజ స్వామి వారి కీర్తనలు ద్రాక్షపాకంతో సమానం. సహస్ర మాసాల పర్యంతం జీవించి 1847 పుష్య బహుళ పంచమి శ్రీరామ నిలో ఐక్యమయ్యారు. సంగీత సన్మండలి ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు కీర్తి గడించిన గాత్ర, జంత్ర, వాద్య సంగీత విద్వాంసులు, వర్ధమానులు అత్యంత భక్తి ప్రపత్తులతో సంగీత సద్గురువు త్యాగరాజ స్వామికి ఘనరాగ పంచరత్న కీర్తనలతో స్వరహారతులందించారు. ఏడు రోజులపాటు ఘంటసాల వేంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రాంగణంలో జరిగిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిసాయి. నాటరాగంలో జగదానందకారక, గౌళ రాగంలో దుడుకు గల, ఆరభి రాగంలో సాధించనే ఓ మనసా, వరాళి రాగంలో కనకన రుచిరా, శ్రీ రాగంలో ఎందరో మహానుభావులు కీర్తనలను పాడి శ్రోతలను భక్తి సంగీత రస జగత్తులో విహరింపజేస్తూ సంగీత సద్గురువునకు స్వర నీరాజనాలందిస్తూ వినిపించారు. ఏడు రోజులు రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి దాదాపు 200 మంది సంగీత కళాకారులు విచ్చేసి భక్తితో వారి త్యాగరాజు కీర్తనలతో నీరాజనార్పించారు. సంగీత సన్మండలి పాలకవర్గం మోదుమూడి సుధాకర్, పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, కె శశిధర్, కె అనిల్ కుమార్, అంజన సుధాకర్ తదితరులు సౌకర్యవంతంగా, సమర్ధవంతంగా నిర్వహించారు.

అభ్యంతరాలు ఉంటే తెలుపండి

పై ఫొటోలో వున్న వ్యక్తి ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్ కాందగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇతనికి బంధువులు ఎవరూ లేరని తెలిపాడు. ఇతని పేరు చారి అని చెప్పాడని, ఇతని మృతి పట్ల ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నచో భువనేశ్వర్ కాందగిరి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని, ఎవరైనా గుర్తిస్తే లారీ యజమాని కన్నబోయిన గోపాలకృష్ణ, ఫోన్ నెం. 7056689999ను సంప్రదించవచ్చు.

ప్రకటన

నా క్లయింట్ అయిన మహమ్మద్ మాబు షరీఫ్, తండ్రి గౌసె షరీఫ్, డోర్ నెం.19-13-43బి, నియర్ కొత్త మసీద్, పాత ఆర్‌ఆర్‌పేట, విజయవాడ సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా... ది.16-01-2025వ తేదీన విజయవాడ భవానీపురం ప్రెసిడెంట్ వీధిలో గల తన బంధువుల ఇంటికి వెళ్ళి వస్తుండగా మార్గమధ్యలో తన బండికి తగిలించిన కవర్ పోయినది. అందులో నా క్లయింట్ తండ్రి గారికి హక్కువిడుదల ద్వారా వచ్చిన ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న డాక్యుమెంట్ నెం.3075/1991 ఒరిజినల్ వున్నవి. సదరు డాక్యుమెంట్ నెం. 3075/1991 ఎవరికైనా దొరికిన దానిని ఈ క్రింది చిరునామాకు అందజేయగలరు. వాటిపై ఎవరు ఎటువంటి క్రిమినల్, సివిల్ చర్యలు తీసుకున్న అవి నా క్లయింట్‌ను బైండు చేయజాలవు. **షెడ్యూలు:** కృష్ణాజిల్లా ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా విజయవాడ వన్‌టౌన్ తారాపేట హాజీబచ్చ సాహెబ్ వీధిలో మున్సిపల్ వార్డు-12, రెవెన్యూ వార్డు-7, బ్లాక్-6, ఎన్.టి.ఎస్ నెం.225 అసెస్మెంట్ నెం.9319 డోర్ నెం.12-5-12లో గల చ.గ 17.8.3లు లేక చ.మీ.15.05 ర్లు స్థిరాస్తి నివేశన స్థలము ఇందలి డాబా **హద్దులు: తూర్పు:** మహమ్మద్ షరీఫ్ గారి ఆస్తి తాలూక గోడ, **దక్షిణం:** మునిసిపల్ రోడ్డు, **పడమర:** మున్సిపల్ రోడ్డు, **ఉత్తరం:** అబ్దుల్ షరీఫ్ గారి ఆస్తికి ఈ ఆస్తికి మధ్య గల జాయింట్ గోడ. ఈ నాలుగు హద్దుల మధ్య గల చ.గ 17.8.3లు లేక చ.మీ.15.05 ర్లు స్థిరాస్తి నివేశన స్థలము ఇందలి గ్రౌండ్ ఫ్లోర్ డాబా.

పులిమల రాణా ప్రసాద్, అడ్వకేట్
డోర్ నెం.29-2-18, మల్లాదివారి వీధి, కోటయ్య మెస్ ఎదురు, రామమందిరం రోడ్, గవర్నర్ పేట, విజయవాడ. సెల్. 9985287999.

హెల్మెట్లు తప్పక ధరించాలి: ఏసీపీ

విశాలాంధ్ర-కంచికచర్ల: రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఏసీపీ తిలక్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా కంచికచర్ల మండలం పరిధిలోని కీసర స్వర్ణ టోల్ ప్లాజా వద్ద ఆదివారం వాహన దారులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకుని నడపాలన్నారు. జాగ్రత్తలు పాటించడం వల్ల సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు అన్నారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపి ఏదైనా ప్రమాదానికి గురియైతే మిమ్మల్ని నమ్ముకున్న కుటుంబం రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై బి.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్యలకు పరిష్కారం

విశాలాంధ్ర-పమిడిముక్కల: సోమవారం పామర్రు తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వర్ల కుమార రాజా తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు కొనసాగే సమావేశంలో పామర్రు నియోజకవర్గ లోని ఆయా మండలాల సమస్యలతో పాటు దశాబ్దాలుగా వేధిస్తున్న సమస్యలు కూడా తెలియజేయవచ్చని ఈ కార్యక్రమానికి కలెక్టర్ డికే బాలాజీ, ఇతర శాఖల ముఖ్య అధికారులు, నాయకులు హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వర్ల కోరారు.

ట్రెజరీస్ అండ్ ఎకౌంట్స్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో ఎంపికైన అభ్యర్థులు

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ ఎకౌంట్స్ సర్వీస్ అసోసియేషన్ కృష్ణాజిల్లా కార్యవర్గ ఎన్నికలు ఆదివారం మచిలీపట్నంలో జరిగాయని అధ్యక్షులు కేవీ లోకేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికలలో కేవీ లోకేశ్వరరావు అధ్యక్షునిగా, కేవీ రమణ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మిగతా కార్యవర్గ సభ్యుల్లో పి.ఆదిశేషు సహాధ్యక్షునిగా, ఏ. శ్రీనివాసరావు ఆర్గనైజింగ్ సెక్రటరీగా, ఉపాధ్యక్షులుగా పివి. నాగేంద్రరావు, కెవిఎన్వి. ప్రసాద్, ఎంపిపి. శ్రీదేవి, సంయుక్త కార్యదర్శులుగా అబ్దుల్ వహాబ్, వి.శ్రీనివాసరావు, పి.రోజ, కోశాధికారిగా ఏ. సోమశేఖర్ ఎంపికయ్యారని నూతన అధ్యక్షులు కెవి. లోకేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

రెంటచింతలలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

విశాలాంధ్ర-రెంటచింతల : గొట్టిముక్కల మేజరు వద్ద రాయపరెడ్డి పొలంలో ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఆదివారం తెల్లవారుజామున చోరీకి గురైంది. రైతు రాయపరెడ్డి నిత్యం ట్రాన్స్ఫార్మర్ను కాపలాగా నిద్రిస్తూవుండేవాడు. శనివారం ఊరికి వెళ్లటంతో అగంతకులు ట్రాన్స్ఫార్మర్లోని రాగి తీగలను చోరీ చేశారు. సుమారు రూ. 2లక్షల వరకు రైతుకు నష్టం వాటిల్లుతుందని విద్యుత్తు శాఖాధికారులు భావిస్తున్నారు. వారం క్రితం గోగిరెడ్డి బాలరెడ్డి నర్సరీలో సుమారు రూ.30వేల విలువ కల్గిన పురుగు మందులు దొంగలు తీసుకెళ్లారు.

అంబేద్కర్‌ను అవమానించిన
అమిత్ షా క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర-గన్నవరం: రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని సీపీఐ గన్నవరం పట్టణ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి డిమాండ్ చేశారు. ఆదివారం అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా క్షమాపణ చెప్పాలని గన్నవరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన తెలిపారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్ షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలన్నారు. గోబ్యాక్ అమిత్ షాట్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, పట్టణ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి, కార్యవర్గ సభ్యులు కట్టవరపు విజయరావు, కె.మోహన్ రావు, ఎన్.మోహన్ రావు, సహాయ కారుదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు కల్లం వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎం. అంజనేయులు, పి.నాగేశ్వరరావు, బడుగు మరియదాసు, కల్లం వెంకటేశ్వరరావు, ఏసుదాసు. మిరప నాగేశ్వరరావు, ఉదయ్, మద్దిరెడ్డి చిన్న, బేతపూడి మరియదాసు, ఏసు దాసు, సురగాని సాంబశివరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - గుడివాడ : పార్లమెంట్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ని అవమానిస్తూ ప్రసంగించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తక్షణం రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని వామపక్షా నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక నెహ్రూ చౌక్ సెంటర్లో వామపక్షా నాయకులు ఆర్‌సిపి రెడ్డి, చింతలూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమిత్‌షా మతోన్మాదం నశించాలన్నారు. దేశ రాజ్యాంగాన్ని కించపరుస్తూ పార్లమెంట్లో ఆయన వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పార్లమెంట్లో తూట్లు పొడిచే విధంగా అమిత్‌షా వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. రాజ్యాంగం వల్లే అమిషా హెూం మంత్రి అయ్యారన్న విషయాన్ని మర్చిపోవడం బాధాకరమన్నారు. తక్షణం హెూం మంత్రి చేసిన వ్యాఖ్య లు ఉపసంహరించుకొని దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామ పక్షా నాయకులు కొమ్ము సురేష్, లంకా సురేంద్ర, ఆర్.కొండ, కోమరవోలు లక్ష్మణరావు, అరుణ, వేసపోగు యేసయ్య, నారా యణ, వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు, వెంకటేశ్వరరావు, నాంచారయ్య, ఎలీషా రావు, తదితరులు పాల్గొన్నారు.

యోగి వేమన రచనలు నైతిక విలువలకు పునాదులు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జ్ఞానవంతమైన సమాజం కోసం ప్రతి వ్యక్తి ఆచరించాల్సిన నైతిక విలువలను వెయ్యేళ్ళ క్రితమే ప్రజా కవి వేమన తన రచనల ద్వారా సమాజాన్ని మేల్కొల్పారని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. యోగి వేమన జయంతి సందర్భంగా స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు ప్రతి వ్యక్తి ఎలా జీవించాలనే అంశాలపై ఎన్నో వచన కవిత్వాలు, పద్యాలు యోగి వేమన రచించారన్నారు. ఆయన పద్యాల్లో విశ్వదాభిరామ వినురవేమ అని వాక్యాన్ని తెలియని తెలుగువారు లేరన్నారు. యోగి వేమన తర్వాత తరంలో తెలుగు గడ్డపై జన్మించిన ఎంతోమంది కవులకు యోగివేమన మార్గదర్శకులుగా నిలిచారన్నారు. ఒక కవి అంతిమ లక్ష్యం సమ సమాజ స్థాపనే అనే అంశాన్ని 1000 సంవత్సరాల క్రితమే ఆయన ప్రబోధించారన్నారు. నేటి తరం కవులు, రచయితలు కూడా యోగివేమన ఆశించిన జ్ఞానవంతమైన సమాజ స్థాపన లక్ష్యంగా రచనలు చేయాలని సూచించారు. ప్రధానంగా నేటితరం విద్యార్థులు యోగివేమన రచించిన వేల పద్యాలను కంఠస్థం చేయడం ద్వారా తెలుగు భాషపై పట్టు సాధించాలన్నారు. కుల మతాలకు అతీతమైన వేమన భావజాలాన్ని నేటి తరం పౌరులు తెలుసుకోవడం ద్వారా ప్రజా కవి యోగివేమన రచించిన పద్యాలకు సార్థకత చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీనరసింహం డిఆర్‌డిఏ పీడీ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనుమానాస్పద పొడి విచారణతో భయాందోళన

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: మండలంలో అనుమానాస్పద పొడి లభించిందనే కారణంగా అధికారులు చేపట్టిన విచారణ ప్రజలకు భయాందోళన కలిగిస్తోంది. వివరాల్లోకి వెళితే... మండలంలోని కలగర పంచాయతీ శివారు రామచంద్రపురం గ్రామంలో శనివారం సాయంత్రం తెలంగాణాకు చెందిన అధికారులు ఆకస్మికంగా విచారణ చేపట్టారు. తెలంగాణా రాష్ట్రంలో అనుమానాస్పదమైన ఒక పొడిని పంపిణీ చేస్తూ రాజశేఖరరెడ్డి అనే వ్యక్తి పట్టుబడ్డాడని, పెద్దమొత్తంలో రామచంద్రపురం గ్రామంలో దీన్ని దాచారనే అనుమానంతో సోదా చేయగా, మూడు కంటైనర్లలో లభించిందని తెలిపారు. ఈ పొడి ఎందుకు వినియోగిస్తారనే విషయాలను విచారిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఇది డ్రగ్స్ తయారీకి వినియోగించే పొడి అని, అందుకే స్వాధీనం చేసుకున్నారనే ప్రచారం సాగుతుండటంతో ప్రజల్లో భయాందోళనకు దారితీసింది. రామచంద్రపురంకు చెందిన పలువురు వ్యక్తులు హైదరాబాదు, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఔషధ తయారీ సంస్థల్లో భాగస్వాములు, డైరక్టర్లు, ఉన్నతాధికారులు, సిబ్బందిగా ఉన్నారు. వీరు ఆయా సంస్థలకు సరఫరా చేసేందుకు పన్నులు లేకుండా తరలించి, దాచిన పొడిగా మరికొన్ని ప్రాంతాల్లో ప్రచారం సాగుతోంది. మన రాష్ట్ర అధికారులు మాత్రం ఇప్పటి వరకు దీని విషయమై ఎటువంటి ప్రకటన చేయలేదు.

మాదిగ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: మాదిగ సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందించనున్నట్లు విస్సన్నపేట మాదిగ పేద విద్యార్థుల సంక్షేమ సంఘం సభ్యులు తెలిపారు. గత పది సంవత్సరాలుగా తమ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 2024-25లో పదవ తరగతి, ఆపై సాంకేతిక విద్యనభ్యసించే మాదిగ విద్యార్థులంతా ఈ బహుమతికి దరఖాస్తు చేసుకోవచ్చని వారు పేర్కొన్నారు. తిరువూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం, చాట్రాయి మండలాల పరిధిలో వీటిని అందించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9885641456, 9440352445 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.సూరిరాజు, పి.ధనరాజు, కలపాల ముఖర్జీ ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

యోగి వేమనకు పుష్పాంజలి

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: యోగి వేమన జయంతి సందర్భంగా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి సీపీ రాజశేఖరబాబు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహితీ, సామాజిక చరిత్రలో తనదైన ముద్ర వేసిన మహనీయుడు యోగి వేమన, సమాజంలోని మూఢాచారాలను నిర్మూలనకు కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని అన్నారు. ప్రతి ఒక్కరికి అర్థమయ్యే భాషలో పద్యాలను వినిపించి అందరిని మెప్పించిన మహాకవి వేమన అని పేర్కొన్నారు. వేమన ఒక ప్రజాకవి, సంఘ సంస్కర్త అని, ఆయన పద్యాలను వినని వారు, తెలియని వారుండరు అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. అటువంటి మహనీయుని జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహించుకోవడం, భావి తరాలకు స్ఫూర్తిదాయకమని, వేమన ఆవిష్కరించిన నైతిక విలువలను యువత ఆదర్శంగా తీసుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్‌తో పాటు, ట్రైనీ ఐ. పి. ఎస్. మనీషా, సి. పి. ఓ అధికారులు, పోలీస్ అధికారులు, సి.పి.ఓ.సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పడవ పోటీల్లో విజేతలకు సత్కారం

విశాలాంధ్ర-దాచేపల్లి : కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పడవ పోటీల్లో దాచేపల్లి మండలం రామాపురం మత్స్యకారుల జట్టుకు ప్రథమ స్థానం వరించిన విషయం విదితమే. సంక్రాంతి పండగలో భాగంగా అక్కడ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన రామాపురం జట్టుకు ఆదివారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

సామర్థ్యాలను ప్రపంచ స్థాయికి తీసుకురావాలి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విద్యార్థుల సామర్థ్యాలను ప్రపంచ స్థాయికి తీసుకువచ్చి ఉన్నత విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టిస్) - స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ స్టడీస్(ఎస్ఈఎస్) చైర్‌పర్సన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రితేష్ ఖున్యాకరి అన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని అకాడమీ ఫర్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్, డీన్ పీసీఎఫ్, డీన్ ఏఏఏ, డీన్ ఐక్యూఏసీ, టిస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 'కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ ఆన్ హార్నెస్సింగ్ ద సైన్స్, టెక్నాలజీ అండ్ సొసైటీ రిలేషన్‌షిప్ ఫర్ మీనింగ్ ఫుల్ హయ్యర్ ఎడ్యుకేషన్' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్‌ను ఆదివారం ఘనంగా ముగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రితేష్ ఖున్యాకరి మాట్లాడుతూ సైన్స్, టెక్నాలజీ, సమాజం మధ్య సంబంధాన్ని సులభంగా అర్థం చేసుకోవడమే కాకుండా, ఇది ఉన్నత విద్యలో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రామాణికమైన మార్పులకు ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు. ఆధునిక సాంకేతికత, పరిష్కారాలు, విద్యా విధానాలు సమాజాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నాయో, అవి విద్యార్థుల కోసం మరింత సమర్థవంతమైన, జ్ఞానంతో కూడిన ఉన్నత విద్యా విధానాలను రూపకల్పన చేయడానికి ఎలా ఉపయోగపడతాయో వివరించారు. ఉన్నత విద్యలో తరగతులు, కోర్సులు, రీసెర్చ్ కార్యక్రమాలను ప్రజల అవసరాలకు అనుగుణంగా దగ్గర చేయాలన్నారు. విద్యార్థులు, అధ్యాపకులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. ముగింపు కార్యక్రమంలో హైదరాబాద్‌లోని టిస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అర్జున్ సేన్‌గుప్త, ముంబాయిలోని టిస్ సీనియర్ రీసెర్చ్ కోఆర్డినేటర్ డాక్టర్ రఫిక్ షేక్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రయోజనాల కోసం ఎల్ఐసీ శక్తివంతం కావాలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: దేశ ప్రయోజనాల కోసం ఎల్ఐసి మరింత శక్తివంతం చేసేందుకు ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 'పటిష్టమైన ఎల్ఐసి - పటిష్టమైన భారత్' నినాదంతో దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమం చేపట్టిందని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్, మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వి.వి.కె.సురేష్ తెలిపారు. ఆదివారం స్థానిక అరండల్ పేట లోని ఎల్ఐసి ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 245 ప్రైవేటు బీమా కంపెనీలను 1956 జనవరి 19 న ఆనాటి పండిట్ నెహ్రూ ప్రభుత్వం విలీనం చేసి ప్రభుత్వ రంగంలో ఎల్ఐసి ని ఏర్పాటు చేసింది. అప్పటి నుండి 'ప్రజల సొమ్ము-పజల సంక్షేమం కోసమే' అనే లక్ష్యంతో పనిచేస్తూ ఎల్ఐసి ప్రపంచంలోనే ధీటైన బీమా సంస్థగా ఎదిగిందని అన్నారు. రైల్వే, రహదారులు, బ్యాంకింగ్, విద్యుత్, నీటి పారుదల వంటి కీలక రంగాలకు కోట్లాది రూపాయల పెట్టుబడులు సమకూరుస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిందని అన్నారు. కేంద్రంలోనున్న ప్రస్తుత ఎన్.డి.ఏ ప్రభుత్వం బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74 నుండి 100 శాతానికి పెంచాలని నిర్ణయించింది. దేశంలో ప్రజల నుంచి సేకరించిన పొదుపు సొమ్మును పెట్టుబడిగా మార్చడం ద్వారా ఆర్థిక ప్రగతి సాధించగలం. దేశీయ పొదుపును ప్రోత్స హించాలి. బీమా ప్రీమియంపై విధిస్తున్న 18 శాతం జి.ఎస్.టి పాలసీదారులకు పెనుభారంగా మారిందని, జి.ఎస్.టిని ఉపసంహరించాలని కోరారు. బీమా మార్కెట్ రెగ్యులేటర్‌గా ఉన్న ఐ.ఆర్.డి.ఏ.ఐ ఇటీవల చేసిన పలు ప్రతిపాదనలు ఎల్ఐసిని బలహీనపరిచేవిగా ఉన్నాయి అని ఈ నేపథ్యంలో ప్రభుత్వరంగ ఎల్ఐసి పరిరక్షణకు, సంస్థను మరింత శక్తివంతం చేసేందుకు విశాలమైన రీతిలో ప్రచారాన్ని కొనసాగిస్తాం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఉపాధ్యక్షులు ఎమ్.డి.కౌసర్ జానీ, మహిళా ఉద్యోగుల సమన్వయ కమిటీ డివిజనల్ కన్వీనర్ సి.హెచ్. మధుబాల, ఆర్.వి.ఎస్.శ్రీనివాస్, పి.ఆర్.రాజశేఖర్, వి.ఆర్.గోపాలకృష్ణ, పి.ఎస్.నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ నియోజక వర్గ పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక నేడు సిపిఎం పార్టీ కార్యాలయం నందు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్గా ప్రముఖ చిత్రకారులు బొద్దువర్ల. ప్రసాదరావు, వైస్ ప్రెసిడెంట్ ఎం. మూర్తి, మరో వైస్ ప్రెసిడెంట్ ఆర్. శంకర్, సెక్రటరీగా కే. వందనం బాబు, జాయింట్ సెక్రెటరీ సిహెచ్. బాజీ, మరో జాయింట్ సెక్రటరీగా బీరం. శ్రీను, ట్రెజరర్ ఎస్.కె. సైదా, వీరిని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కమిటీ రెండు సంవత్సరాలు పాటు కొనసాగుతుందని అలానే పెయింటర్స్ ఆర్టిస్ట్లకు గవర్నమెంట్ ద్వారా అందవలసిన సంక్షేమ పథకాలు ఇంటి స్థలాలు గుర్తింపు కార్డులు కొరకు కృషి చేస్తామని వారికి అండగా పనిచేస్తామని వారన్నారు కార్యక్రమంలో కమిటీ మెంబర్స్ ఎంవి. దానయ్య, ఎం. పోలురాజు, ఎస్. రాజు కుమార్ సింగ్, జి. చంద్రం, కే. నాగ రాజు, పి. రామకృష్ణ, నరసింహారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల కేంద్రమైన దుగ్గిరాల జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం కల్మషం లేని మనసు,దిగులు, చింతలేని వయసులో ఆడుతూ... పాడుతూ విద్యను అభ్యసించి,వారి జీవన పోరాటంలో తలో దారిలో వెళ్లిన నాటి విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత మరోసారి కలసి,తమ చిన్ననాటి జ్ఞాపకాలు,అల్లర్లు గుర్తు చేసుకున్నారు.దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 1995 – 96 లో పదవతరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న జీవిఆర్ కోల్డ్ స్టోరేజ్ ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మొత్తం 60 మంది విద్యార్థులు కలుసుకొని,అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ,ఆప్యాయంగా పలకరించుకున్నారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు.తదుపరి అందరు కలిసి విందును ఆరగించి వారి జ్ఞాపకాలను పంచుకున్నారు.

ఘనంగా వేమన జయంతి

విశాలాంధ్ర-దాచేపల్లి : యోగి వేమన జయంతి వేడుకలను ఆదివారం స్థానిక బీసీ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో వేమన జయంతి సందర్భంగా గురుపూజోత్సవం చేశారు. అనంతరం పల్లకి ఊరేగింపు మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ వేమన తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపర్చినట్లు చెప్పారు. ప్రజా కవి, అభ్యుదయ వాది, గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. శాస్త్రీయ దృక్పథంతో పద్యాలను రచించి నట్లు తెలిపారు. పామరులను సైతం తన పద్యాలు అర్థమయ్యే విధంగా రచించి తెలుగు ఔన్నత్యాన్ని చాటిచెప్పినట్లు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర-యడ్లపాడు : మండల కేంద్రమైన యడ్లపాడులోని లూథరన్ ఉన్నత పాఠశాలలో 1977వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ద్వితీయ ఆత్మీయ సమావేశం ఆదివారం పాఠశాలలో జరిగింది. అప్పటి గురువు లైన జోసెఫ్, వినతి, రాజారావు మాస్టారులకు ఘనంగా సన్మానం చేశారు. విశాఖ పట్నం నుంచి సాల్మన్ రాజు, బెంగుళూరు నుంచి రాజేశ్వరి, హైదరాబాద్ నుంచి సుకన్య, ముత్తవరపు ఆంజనేయులు తదితర పూర్వ విద్యార్థులు పలువురు హాజరై పూర్తిస్థాయిలో దిగ్విజయంగా నిర్వహించారు. సంతోషంగా గడిపారు. సాయంత్రం వరకు వివరాలతో, ఆనందాలతో గత వైభవాన్ని చెప్పుకుని సంతోషించారు. ప్రస్తుత స్కూలు పరిస్థితికి విచారం వ్యక్తం చేశారు. నాగండ్ల శేషగిరిరావు అధ్యక్షత వహించగా, వైబీవీ శ్రీనివాసరావు, పి.బెంజిమన్, ఉన్నవ సాంబయ్య, ఉప్పలపాటి రాజ్యలక్ష్మీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

డ్రగ్స్‌పై యువత అవగాహనతో ఉండాలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ప్రస్తుత ఉన్న పరీక్షల సమయంలో డ్రగ్స్ పట్ల యువత అవగాహనతో ఉండాలని తెలుగు స్టూడెంట్ ఫెడరేషన్ (టిఎస్ఎఫ్) మీడియా కోఆర్డినేటర్ ఘట్టమనేని గణేష్ అన్నారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మత్తు పదార్థాల సమస్య కీలకంగా మారిందని, గత ప్రభుత్వం చేసిన పొరపాట్లతో రాష్ట్రంలో గంజాయి రాజ్యమేలిందని ఇప్పుడు దాన్ని కట్టడి చేసేందుకై కూటమి ప్రభుత్వం ఎంతగానో శ్రమిస్తుందని అన్నారు. పరీక్షల సమయం కావడంతో ఒత్తిడిని అధిగమించేందుకై కొందరు చెడు స్నేహితుల మాటలు విని డ్రగ్స్ తీసుకుంటున్న యువత ఆ ఊబిలో కూరుకుపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలకారు. ఆదివారం గుంటూరు టూ టౌన్ ఎక్సైజ్ పోలీసులు గుంటూరు జిల్లాలో మొదటి కొకైన కేసును పట్టుకోవడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. ముద్దాయి లను అరెస్టు చేసినందుకు ఎక్సైజ్ శాఖకు కృతజ్ఞతలు తెలుపుతూ అస్సలు రాష్ట్రానికి కొకైన సరఫరా చేసిన వ్యక్తులను అరెస్ట్ చేయాలని కోరారు. కళాశాల విద్యార్థులు లక్ష్యంగా ఈ వ్యాపారం జరుగుతుందని కళాశాలపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టిని ఉంచాలని కోరారు.

ఘనంగా శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: శ్రీ సరస్వతి సంగీత విద్వత్ సభ ఆధ్వర్యంలో స్థానిక అరండల్ పేట శ్రీ మోహన రంగనాయక స్వామి వారి దేవస్థానంలో శ్రీ త్యాగరాజ స్వామి వారి 178వ ఆరాధనో త్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిపారు. భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానం ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామాచార్యులు, వనజ దంపతులు జ్యోతి ప్రజ్వలన గావించారు. పూజా కార్యక్రమాల తదుపరి విశ్వ సంకీర్తనాచార్యులు మాడభూషి నరసింహాచార్యులు "ఘనరాగ కృతులు పంచరత్న గోష్టి" గానము గావించారు. అనంతరం నరసింహాచార్యులు, శిష్య, ప్రశిష్యుల బృందం "లఘు అఖండము" పేరుతో అత్యంత భక్తి శ్రద్ధలతో 12 గంటల పాటుసాగిన నిర్విరామంగా త్యాగరాజ స్వామి వారి కృతులు, కీర్తనలతో సంగీతార్చన గావించారు. పేరవలి నందకుమార్, ధూళిపాళ్ల శ్రీనివాస్, చావలి శ్రీనివాస్ వయోలిన్ సహకారం అందించగా, బీరకాయ సురేష్ బాబు, కే జగన్మోహిని, చావలి కృష్ణమోహన్లు మృదంగం సహకారం అందించారు. కార్యక్రమాన్ని గడియారం సువర్ణ విద్య, ఎం శారద, వామన్ కుమార్, దేవస్థానం ట్రస్ట్, దేశరాజు పట్టాభి రామచంద్ర మూర్తి పర్యవేక్షించారు.